సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మ బొరుసు వంటివి!



వాయిస్ ఆఫ్

# చార్వాక

సామాజిక చైతన్య మాసపత్రిక



సంపుటి : 19 సంచిక : 3 జూలై – సెప్టెంబర్ 2024

## హైదరాబాద్‌లో జరిగిన నాస్తిక అధ్యయన తరగతుల దృశ్యములు



డా॥ ఆర్.కె.రచన 'తత్వశాస్త్ర చరిత్ర – గతితార్కిక భౌతికవాదం' పుస్తకావిష్కరణ



విజయరాములు



జనార్ధన్



కోయి కోటేశ్వరరావు



పద్మావతి



అరుణ్‌కుమార్

ప్రచురణ :
చార్వాకాశ్రమం

నిర్వహణ :
నాస్తిక సమాజం

# వాయిస్ ఆఫ్ చార్వాక

జూలై - సెప్టెంబర్
2024

గౌరవ సంపాదకులు : **డా॥ భాను ప్రసాద్**

ప్రధాన సంపాదకులు : **బి. సుధాకర్**

సహాయ సంపాదకులు :
జంజనం సత్యనారాయణ
సత్య నిర్ధారణ్
యం.యన్. బుద్ధ
వి.వి.డి.ఎస్. ప్రసాద్
లతీఫ్
కొర్రపాటి హనుమంతరావు
నండూరి నారాయణరావు
నాస్తిక్ శ్రీకాంత్



**రచనలు, అభిప్రాయాలు, విరాళాలు**
పంపవలసిన చిరునామా :
**బి. సుధాకర్**
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు),
మంగళగిరి (మండలం)
గుంటూరు జిల్లా – 522 240.
సెల్ : 9290619550, 9440101814
ఎకౌంట్ నెం. 30174955006,
SBI Main Branch, Mangalagiri
IFSC Code : SBIN0001011
Google Pay, Phone Pay : 9290619550
voiceofcharwaka@gmail.com


శాస్త్రీయ స్పృహను
మానవ వాదాన్ని, పరిశీలనాతత్వాన్ని,
సంస్కరణను పెంపొందించటం
ప్రతి భారతీయ పౌరుని విధి,
భారత రాజ్యాంగం
ఆర్టికల్ 51(A)(H) రూల్ IV A.


**పత్రికలో ప్రచురించిన రచనలు ఆయా రచయితల అభిప్రాయాలు మాత్రమే. పత్రిక యాజమాన్యం వారి అభిప్రాయాలతో ఏకీభవించనవసరం లేదు.**


## ఈ సంచికలో...


| | | |
|---|---|---|
| 1. | లౌకిక రాజ్యం - మతం - దైవదూతలు | 3 |
| 2. | నాస్తిక చతురోక్తులు | 8 |
| 3. | మెదడు కలిగించే గందరగోళం | 11 |
| 4. | మరియమ్మకు ప్రధానం | 13 |
| 5. | కులాల కతీతుడైన దళితుల కవి జాషువా | 15 |
| 6. | ఆహారం-ఆరోగ్యం | 21 |
| 7. | గాంధీ - భగత్‌సింగ్ | 23 |
| 8. | భారత చరిత్రలో అతిపెద్ద నాస్తిక ఉద్యమం | 27 |
| 9. | వాస్తు అబద్ధం | 32 |
| 10. | రాహువే లేనప్పుడు రాహుకాలం ఎక్కడిది? | 33 |
| 11. | జమిలీ ఎన్నికలురాజకీయ నియంతృత్వానికే | 36 |
| 12. | వాళ్ళుచాలా క్లారిటీగానే వున్నారు | 39 |


అసలు ఉనికి దొరకని, కంటికి కనిపించని దైవం ఉందని, ఆ దైవం ఈ విశ్వాన్ని సృష్టించిందని, ఆ దైవానికి అంతటి శక్తి ఉందని, ఏ ఆధారంగా చెప్పగలుగుతున్నారు? ఉనికే తెలియదు!, కంటికి కనిపించనూ లేదు. కానీ అంతటి శక్తి యుక్తులు ఆ దైవానికి ఉన్నాయని ఎలా చెప్పటం? చెప్పేవారు ఛాదస్తులైనా వినేవారికి వివరం ఉండాలి కదా! దున్నపోతు ఈనింది అంటే దూడని కట్టేయండి అనడంలో ఏమైనా విజ్ఞత ఉందా? దున్నపోతు ఈనడం ఏమిటి!? అనే సందేహం కలగొద్దా? సందేహాలు కలగాలి. సందేహాలు నివృత్తి కావాలి. మెదడుకి పదును నిత్యం పెట్టుకోవాలి. విశ్వం నుండి తెలియని విషయాలు తెలుస్తాయి. విశ్వ పరిశీలన, విశ్వశోధనతో సర్వసందేహాలకు నివృత్తి లభిస్తుంది. విశ్వం మిథ్య అని, విశ్వానికి మించిన మరేదో శక్తి ఉండి ఉంటుందని, దానికి విశ్వాన్ని సృష్టించే శక్తి ఉంటుందని ఊహించు కోవడమే తప్పు. అది నేల విడిచి సాము చేయడమే. అది ప్రమాదకరం. అది నిరాధారం. అది అజ్ఞానం, అది మూఢనమ్మకం, అది మూర్ఖత్వం, అది అనాలోచన, ఆలోచనే మానవ ఆయుధం. ఆ ఆయుధంతోనే సర్వాన్ని సాధించవచ్చును. అదే విశ్వజ్ఞానం. మతాలే మనకు వద్దు. విశ్వవిజ్ఞానమే మనకు ముద్దు. – **బల్లెం**


నాస్తిక సాహిత్యం కోసం సంప్రదించండి :
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు), మంగళగిరి, గుంటూరు జిల్లా – 522 240.
ఫోన్ : 91777 21588, https://charvaka.co.in/

# లౌకిక రాజ్యం - మతం - దైవదూతలు

- సంగిరెడ్డి హనుమంత రెడ్డి,
*ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,*

'తల్లి వాస్తవం తండ్రి నమ్మకం' అన్న నానుడి పాతదే. "పిల్లలు మన ద్వారా వస్తారు. మన కోసం రారు" అన్న లెబనీస్ అమెరికన్ రచయిత, కవి, దార్శనిక కళాకారుడు ఖలీల్ గిబ్రన్ అసలు అర్థాన్ని, తాత్వికతను గ్రహించాలి. అలాగే మతం, దేవుడు మనిషి సృష్టి. అవి వ్యక్తిగతం. బాహ్య ప్రపంచంలో మనిషి లౌకిక మానవునిగా మారాలి.

**లౌకిక రాజ్యం :** బతుకు చావులిక్కడే. వీటి కోసం ఎక్కడికి వెళ్ళాలి? స్వర్గమిదే నరకమిదే. వీటి కోసం ఎక్కడికి పోవాలి? మేరా నామ్ జోకర్ సినిమా కోసం శైలేంద్ర రాసిన పాటలో ఒక చరణమిది. మన జీవన్మరణాలు ఈ భూమి మీదే. స్వర్గనరకాలు పౌరాణిక కల్పనలలో కాదు కాని, సుఖదుఃఖాలని అర్థం. అయితే రాజ్యం సుఖాలను కొందరు సంపన్నులకే అందిస్తుంది. పాలకులను గెలిపించినవారితో సహా 90 శాతం మందికి దుఃఖాలను పంచుతుంది. పూర్వ జన్మను ఎవరూ చూడలేదు. మరో జన్మ ఉందో లేదో తెలియదు. ఈ జన్మ సత్యం. కర్మ సిద్ధాంతం అబద్ధం. మోక్షం మోసం. ఈ జీవితంలోని ఆనందాన్ని, సంతోషాన్ని, మాధుర్యాన్ని క్రమశిక్షణతో, హక్కులు, బాధ్యతలతో, ఇతరులకు, సమాజానికి నష్టం కలిగించకుండా నిరాడంబరంగా అనుభవిద్దాం. ఇదే లౌకికత్వం. మతంతో సంబంధం లేని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలలో జోక్యంలేని ప్రకృతిపై ఆధారపడి ఇహలోక అంశాలను మాత్రమే పట్టించుకునే రాజ్యమే లౌకిక రాజ్యం. మతాన్ని రాజ్యం నుండి వేరుచేయడమే లౌకికత్వం. మతం, లౌకికత్వ ఆలోచనలు క్రైస్తవ మత గ్రంథమైన బైబిల్ లో మత ప్రభావం నుండి పుట్టిన లాటిన్ భాషా మూలాలు కలిగిన పాశ్చాత్య అవగాహనలు. నిజానికి భారతీయ భాషలలో వీటికి సమానాత్మక పదాలు లేవు. లౌకికత్వం దగ్గరి అర్థాన్నిచ్చే పదమే. మతాలకు సమదూరం, సర్వధర్మ తత్వం అనేవి మోసాలు. ప్రజాస్థలాల్లో అన్ని మత దేవతల బొమ్మలు పెట్టడం కాక ఏ దేవుని బొమ్మనూ పెట్టకపోవడం లౌకికత్వం. ఇది మత సంబంధమో, మత వ్యతిరేకమో కాదు. భౌతికవాదానికి, మతరాహిత్యానికి దారితీసే బహుళస్థాయి ఆలోచన. మతభావాల తగ్గింపు, ప్రత్యామ్నాయ భావజాల నిర్మాణం, మతాన్ని వ్యక్తిగతంచేసి ఇంటికే పరిమితం చేయడం అన్న ప్రక్రియల ద్వారా లౌకికత్వాన్ని విస్తరించవచ్చు. జాతీయోద్యమంలో గాంధి మతాలన్నిటిని కలుపుకొని పనిచేశారు. కానీ నెహ్రూ, నేతాజీలు తప్ప గాంధి కాని ఇతర స్వాతంత్ర ఉద్యమ నాయకులు కాని మతరహిత సమాజ నిర్మాణ అవసరాన్ని గుర్తించలేదు. అందుకే ఉద్యమ, దేశ విభజన సమయాలలోనే గాక నేటికీ మతోన్మాదాన్ని తప్పించుకోలేకున్నాము.

రాజ్యాంగ నిర్మాతలలో వైదికవాదులు మన దేశాన్ని హిందుదేశంగా ప్రకటించాలన్నారు. అంబేడ్కర్, జవహర్లాల్ నెహ్రూల వాదనల ఫలితంగా అలా జరగలేదు. 'భారత దేశం మతాలను గుర్తించి, అంగీకరిస్తుంది. ఆచరణ, ప్రచార అవకాశాలను కల్పిస్తుంది. కాని ఒక మతానికి అనుకూలంగా ఉండదు.' అని రాజ్యాంగం చెప్పింది. మత మైనారిటీలకు విద్య, సాంస్కృతిక

హక్కులనిచ్చింది. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజలందరూ పెంచాలని పేర్కొంది. (మన పాలకులు ఓట్ల రాజకీయాలతో లౌకికత్వాన్ని తుంగలో తొక్కారు. ఫలితంగా లౌకికత్వమే మతాంతీకరణ చెందింది.) భారత రాజ్యాంగం లౌకికత్వ అత్యుత్తమ భావాల ఆధారంగా రచించబడింది. ప్రజాజీవితంలో మతప్రభావం తగ్గాలని భావించింది. కుల మత వర్గ లింగాలతో సంబంధం లేకుండా అందరికీ పౌరసత్వం ఇచ్చింది. శతాబ్దాల తరబడి సామాజిక, ఆర్థిక సంబంధాలను నియంత్రించిన హిందు చట్టాలు, ఆచార సాంప్రదాయాలు, దళిత నిషేధాలను తుడిచేసింది. జాతీయ లౌకికత్వాన్ని ఆవిర్భవించింది. మతాధార లౌకికత్వాన్ని ప్రతిపాదించలేదు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాతృత్వ సూత్రాల నాస్తిక రాజ్యంగా అవతరించింది. వెంకటరెడ్డి, విష్ణుశర్మ, వీరయ్య చౌదరిల కులం చెప్పనవసరం లేదు. రాజ్యాంగ ప్రతి అధికరణలో లౌకికత్వం నిక్షిప్తమయింది. అందుకే రాజ్యాంగం రచయితలు దానికి లౌకిక పదాన్ని జోడించలేదు. కానీ సంఘ్ భావజాల వాదులకు ఈ రాజ్యాంగం నచ్చలేదు. మనుస్మృతి విశ్వవ్యాపిత, సర్వజనామోదిత వైదిక రాజ్యాంగమని, అదే మనకు రాజ్యాంగమని వాదించారు. 2013 లో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి వచ్చిన వైదికులకు బిజెపి పాలిత రాష్ట్రాలలో పౌరసత్వమే కాక ఓటు హక్కు కూడా ఇచ్చారు. 2014 లో 19 పార్లమెంటు సీట్లు పొందారు. ఈ అనుభవంతో లాభాపేక్షతతో అస్సాంలో జనాభా నమోదు జాబితా ప్రక్రియను మొదలు పెట్టారు. పాకిస్తాన్, బర్మా, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి వచ్చిన, రాబోయే ముస్లిమేతరులకు మాత్రమే పౌరసత్వం, ఓటు హక్కు ఇవ్వాలని 2019 రాజ్యాంగ వ్యతిరేక పౌరసత్వ సవరణచట్టం చేశారు. మోదీ ప్రభుత్వం భారత్‌ను అప్రకటిత ఆచరణ హిందుదేశంగా మార్చింది. 1976 అత్యయిక పాలనలో ఇందిరాగాంధి 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 'లౌకిక' పదాన్ని పీఠికలో చేర్చారు. కాని లౌకికత్వ అమలు విధానాన్ని ప్రస్తావించలేదు.

**మతం:** "మత దుస్థితి ఏకకాలంలో అసలు ఆర్థిక బాధల ఉపశమన ప్రకటన. వాస్తవ విపత్తులపై తిరుగుబాటు. మతం పీడిత ప్రాణుల నిట్టూర్పు. హృదయంలేని ప్రపంచంలో హృదయం. ఆలోచనారహిత పరిస్థితిలో మేధోపర ధైర్యం. ప్రజల మత్తుమందు. బాధితుల నిజమయిన సంతోషానికి సంతోష భ్రమభ్రాంతుల మతాన్ని రద్దుచేయాలి. భ్రమభ్రాంతుల అవసరాలను తొలగించే పరిస్థితులను తయారుచేయడమే (మతరద్దు) పరిస్థితి నిర్మాణ అవశ్య అభ్యర్థన కావాలి." అని కార్ల్ మార్క్స్ మతాన్ని విశ్లేషించారు. మార్క్స్ నివసించిన సమాజాలలో మత్తుమందు నిషేధిత పదార్థం కాదు. ఆ పదాన్ని ఆయన వ్యతిరేక భావంతో వాడలేదని అర్థంచేసుకోవాలి. బాధితులను వెంటనే మత ఓదార్పు నుండి దూరంచేయరాదు. దైనందిన జీవితంలో అవసర భౌతిక పరిస్థితులను, అనవసర మత దైవ భావాలను వారికి వివరించాలి. భారత రాజ్యాంగం మతస్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా హామీ ఇచ్చింది. మతం అంటే ఆలోచన అని అర్థం. వివేకం, భౌతిక సామాజిక అంశాల నుండి మనిషి ఆలోచనను పరలోక భావాలకు మళ్ళించారు. మతాలన్నీ ఒకే రకమైన కల్పనలు. సనాతన సంప్రదాయ విశ్వాసాలు, ఛాందస భావాలు వైదికంలోనే కాదు, ఇతర మతాలలోనూ వ్యాపించాయి. మతాలు, మత గ్రంధాలు మగాళ్ళ సృష్టి. అందుకే అవి పురుషాధిపత్యంతో ఆడవారిని అణగదొక్కేవిగా ఉంటాయి. మతం సంపన్నులకు అనుకూలంగా సూక్తులు చెపుతుంది. పేదలను పుణ్యపాపాలు, స్వర్గనరకాలతో బెదిరిస్తుంది. నేటి నీ దీనస్థితికి

నీ పూర్వజన్మ కర్మల ఫలితమే కారణమని, ఈ జన్మలో (దోపిడీ) ధర్మాన్ని పాటిస్తే మరు జన్మలో సుఖం దక్కుతుందని సిద్ధాంతీకరిస్తుంది. తాడితపీడితుల నుండి ప్రశ్నలు, విచక్షణ, వివేకం, నిరసన తిరుగుబాట్లను అణచివేస్తుంది. దోపిడీని కొనసాగిస్తుంది. మనుషుల ఆలోచనలను, నైతిక ప్రవర్తనలను, సామాజిక జీవితాన్ని నిర్దేశించే, నియంత్రించే మతం ప్రగతికి అడ్డంకి.

రోమ్, అమెరికా, పాశ్చాత్య దేశాల, ఇజ్రాయిల్, పాలస్తీనాల అబ్రహాం మతాలు క్రైస్తవం, ఇస్లాం, జుడాయిజం, సామరిటనిజం, డ్రూజులు అన్నిటికీ ఒకే పవిత్ర స్థలం జెరుసెలం. దాని కోసం పోట్లాటలో ఇజ్రాయిల్ దేశం ఏర్పడింది. పాలస్తీనా మాయమయింది. మన వైదికానికి అయోధ్య, మధుర, కాశీ పవిత్ర స్థలాలు. నేటి ప్రభుత్వ కొనసాగింపు ఎత్తుగడలు. దాని కోసం ఒక చారిత్రక నిర్మాణ మసీదు కూలింది. మతోన్మాద పాలనకు దారితీసింది. భారత ఉపఖండంలో పుట్టిన లేదా ప్రారంభమయిన వైదిక (హిందు) మతం, బుద్ధిజం, జైన, శిక్కు మతాలు మధ్య రాతి యుగం నాటి ధార్మిక లేదా ఇండిక్ మతాలు. క్రైస్తవ, ఇస్లాం విదేశీ మతాలను ఇండియా ఇముడ్చుకుంది. వైదికం లో శైవవైష్ణవాలున్నాయి. పౌరాణిక కాలంలో శైవం నాస్తికం. క్రీ.శ. 10, 11 శతాబ్దాలలో శైవవైష్ణవాలు కొట్లాడుకున్నాయి. మొదట శైవం తర్వాత వైష్ణవం జైనబౌద్ధాలను నాశనంచేశాయి. అమరావతి, తిరుమల క్షేత్రాలు దీనికి ప్రత్యక్ష సాక్ష్యాలు. భారతీయ తాత్వికతలో ఆస్తిక, నాస్తిక విభాగాలున్నాయి. బుద్ధులు, జైనులు, చార్వాకులు, లోకాయతులు, ద్రౌపదులు భౌతికవాదులు, నాస్తికులు. శృతి, స్మృతి, వివేక, విజ్ఞాన శాస్త్రాల ఆధారంగా వైదిక సాహిత్యాన్ని ఆమోదించనివారు నాస్తికులని మనుస్మృతి 2.11 శ్లోకం చెపుతుంది. 8.309 శ్లోకం ప్రకారం నాస్తికుడు మరోలోకాన్ని నమ్మడు. ఈ లోకాన్ని మాత్రమే నమ్ముతాడు. 9వ శతాబ్దపు భారతీయ పండితుడు మేధాతిథి ప్రకారం నాస్తికుడు వేదాలు అబద్దాలనడు. అవి అనైతికమంటాడు. దానధర్మాల, యజ్ఞయాగాల, వైదిక సాహిత్యాలతో ప్రయోజనం లేదంటాడు.

"దేవున్ని సంపన్నం చేయడానికి మనిషి పేదరికం పాలుకావాలి. దేవుడు సర్వస్వం కావచ్చు. మనిషి శూన్యుడవుతాడు." దివ్యత్వ సర్వశక్తికి, మానవ నపుంసకత్వానికి ఇదే రహస్యం. మతం వ్యాపారానికి మంచి అనుకూలం. అది అత్యుత్తమ వ్యాపారం కూడా. దీనికి పెట్టుబడి, సరుకులు అవసరంలేదు. ఇతర సమస్యలు ఉండవు. నిరాకార పెట్టుబడితో నిరాకార వస్తుసేవలు పొందవచ్చు. మతం, ఆధ్యాత్మికత సంపన్నవర్గాలు సామాన్యులపై ప్రయోగించే మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు. గుళ్ళకు పోయేవాళ్ళకు, విభూతి, బొట్టు పెట్టుకునేవాళ్ళకు సమాజంలో గౌరవమర్యాదలు దొరుకుతాయి. మంచివారిగా ముద్రపడుతుంది. వాళ్ళ మోసాలకు మాన్యత లభిస్తుంది. మతఛాందసం పెరిగితే బాధితులకు మానవ హక్కులు మాయమవుతాయి.

సునాయాసంగా దోపిడీని కొనసాగించడానికి కొందరు ప్రార్థనాలయాలను స్థాపిస్తారు. కొరియా పారిశ్రామికవేత్త, శతకోటీశ్వరుడు సూన్ మ్యూమ్గ్ మూన్ యూనిఫికేషన్ చర్చిని నడుపుతారు. అమెరికాలో మధ్య తరగతి ప్రజలను మభ్యపెట్టడానికి 1950 లలో వైద్యులు కాని మానసికచికిత్సకులు గోర్డాన్ ఆల్పోర్ట్, అబ్రహాం మాస్లో, ఎవరెట్ షోస్ట్రోమ్, కార్ల్ రోజర్స్, హూమన్ పొటెన్షియల్, ఫ్రిట్జ్ పెరల్స్ ఉద్యమాన్ని స్థాపించారు. మనిషి ప్రాథమికంగా పాపబుద్ధి కలవాడని, దైవవిశ్వాసమే అతన్ని రక్షిస్తుందని ప్రచారంచేశారు. ఈ ఉద్యమం పరిపూర్ణ మానవులను

తయారుచేస్తుందన్న నమ్మకం ప్రబలింది. 19వ శతాబ్దంలో పతనమైన వైదిక మతం బ్రహ్మ, ప్రార్థన, ఆర్య సమాజాలతో, స్వామి వివేకానంద, బంకించంద్ర ఛటర్జి లాంటి వ్యక్తుల ప్రచారాలు, రచనలతో మరలా పురోగమించింది. క్రైస్తవ చైతన్య కార్యక్రమాలు ప్రపంచవ్యాపితంగా కొత్త భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఐరోపాలో అతివేగంగా తిరోగమిస్తున్న రోమన్ క్యాథలిజం ఫ్రాన్స్‌లో మొదలుపెట్టిన ఆకర్షణీయ ఇమ్మాన్యుయల్ కమ్యూనిటి ఉద్యమాలతో తిరిగి పుంజుకుంది. ఇప్పుడు ఇది 50 దేశాలలో వ్యాపించింది. రాందేవ్, రవిశంకర్‌ల యోగా, వినియోగ వస్తు వాణిజ్యంతో మోదీ ప్రపంచమంతా హిందుత్వాన్ని ప్రచారం చేస్తున్నారు. కన్య మేరి పుణ్యక్షేత్రాలు ఐరోపాలో యాత్రికులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. అయోధ్య మందిరం ద్వారా మోదీ ఇదే పనిచేశారు. నేటి రష్యాలో రష్యన్ ఆర్థొడాక్స్ చర్చి ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. 1997 నుండి రష్యా ప్రభుత్వం అన్ని చర్చిలను దీని పోటీ నుండి తప్పించింది. జెహోవాహ్ సాక్ష్యాలు, హరే కృష్ణ, సైంటాలజి, ఎవాంజెలికల్, క్యాథలిక్ చర్చిలు, జై శ్రీరాం వంటి ఉద్యమాలు ఎగసిపడుతున్నాయి. ప్రపంచ అత్యంత మత రాజ్యాలలో ఒకటిగా చైనా ఉద్భవించింది. అంతర్జాల మత కార్యక్రమాలు విపరీతంగా పెరిగాయి. శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, డాక్టర్లలో మతభావాలను పెంచుతున్నాయి. సామాజిక, సాంస్కృతిక, లౌకిక అధ్యయన అమెరికా సంస్థ నిర్వహించిన సర్వేలో అత్యధికులు దేవున్ని, మానవాతీత శక్తులను, బాబాల అమ్మల అద్భుతాలను నమ్ముతున్నట్లు తేలింది. అమెరికాలో వేదిక్ క్రియేషనిజం అనే కొత్త ధోరణి పెరిగింది. ఇండియాలో ప్రధాని, మంత్రులు, విశ్వవిద్యాలయాల సంఘీయ ఉప కులపతులు ప్రచారం చేసినట్లు యజ్ఞాలు, యోగిక సిద్ధి, పూర్ణ జ్యోతిష్యం విజ్ఞానశాస్త్ర విభాగాలను అమెరికాలో దీపక్ చోప్రా లాంటి వాళ్ళు ప్రచారం చేస్తున్నారు. భారత ముస్లింలపై విషం కక్కుతున్నారు. క్రైస్తవదేశంలో బతుకుతున్న వీరిపై ఆ దేశం వలసజీవులనో, ఇతర మతస్తులనో దాడులు చేస్తే ఏంటి పరిస్థితి? ఈ ఏడాది ట్రంప్ గెలిస్తే విదేశీయుల బహిష్కరణ తప్పదు. మరోప్రక్క ఇస్లామిక్ ప్రపంచంలో ఖురాన్ పద్యాల్లో ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని వెదికే సంప్రదాయం కొనసాగుతోంది.

సామాజిక, సాంస్కృతిక లౌకికత్వంతో మనిషి మానసిక స్పృహ, స్మారక స్థితి లౌకికత్వం చెందుతాయి. 'సర్వధర్మ సంభవం – అన్ని మతాలకు సమాన గౌరవం' అని గాంధి అన్నారు. 'ధర్మ నిరపేక్షత – అన్ని మతాలకు సమాన వ్యత్యాసం' అని నెహ్రూ వివరించారు. మతం, దేవుడు వ్యక్తిగత భావనలు. వ్యక్తిగత జీవితాలకు, ఇంటికి పరిమితం కావాలి. కాని నేడు ప్రజా జీవితాలు, రాజకీయాలలోకి, రాజకీయ సంస్థలు, వ్యవస్థలు, కార్యక్రమాలలోకి, రాజ్యం, మార్కెట్ మాయాజాలంలోకి మతం ప్రవేశించింది. కుటుంబ క్రతువులు బజారునపడి బహిరంగ ప్రచార అస్త్రాలుగా, ఆర్భాటాలుగా, అతి ఖర్చుతో కూడి రాజకీయ నైజాన్ని సంతరించుకున్నాయి. వీటిలో రాజకీయం, రాజకీయులు ప్రవేశించారు. హిందువులలోనే కాదు నేడు ఇతర మతస్తులలో కూడా మతతత్వం పెరిగింది. బ్రెజిల్, రష్యా, చైనా, పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన అమెరికా లాంటి దేశాల్లో మతవాదం, శ్వేత జాత్యహంకారం విజృంభించాయి. ఇజ్రాయెల్‌లో జుడాయిజం, భారత్‌లో వైదిక హిందూవాదం, బర్మాలో బుద్ధిజం అతిగా బహిరంగ రూపం దాల్చాయి. బజారున పడ్డాయి.

కార్ల్ మార్క్స్, ఎంగెల్స్, మ్యాక్స్ వెబర్, ఎమిలె డర్జీమ్, సిగ్మండ్ ఫ్రాయిడ్, ఫ్రెడరిక్ నీషే లాంటి దిగ్గజ సామాజిక శాస్త్రవేత్తలు మతం అంతరించే రోజులు దగ్గరపడ్డాయని, భవిష్యత్తు లౌకికత్వానిదేనని ఆనాటి సామాజిక పరిస్థితులను బట్టి అభిప్రాయపడ్డారు. కానీ వందల ఏళ్ళు గడిచినా ఈ అభిప్రాయం తలక్రిందులయింది. దేవుడు, స్వర్గం, నరకం, ఆత్మ పునరుద్ధరణ (పునర్జన్మ) అన్న సంప్రదాయ క్రైస్తవ భావాలు ఐరోపా లౌకిక దేశాలలో కూడా పెరిగాయి. వీటిలో స్వీడెన్, ఫిన్లండ్, హాలండ్, జర్మని, బ్రిటన్లు అమెరికా శైలి సువార్త ప్రచారాలలోకి వెళ్ళాయి.

**పీటర్ బర్గర్ తీర్పు:** ఆధునికత అనివార్యంగా మతాన్ని తిరస్కరిస్తుందని ఆస్ట్రియాలో జన్మించిన అమెరికన్ సామాజిక శాస్త్రవేత్త ప్రతిపాదన. అంటే విద్య, చదువు, సాంకేతికతలతో పెరిగిన విజ్ఞానశాస్త్ర ఉపకరణలతో సౌకర్యాలను పొందుతున్నవారిలో మత దైవ భావనలు తగ్గుతాయని, లౌకికత్వం పెరుగుతుందని సూత్రీకరించారు. పూర్వ కమ్యూనిస్టు దేశాలలో ఈ సూత్రం వర్తించింది. ఆ దేశాల్లో కమ్యూనిజం పతనంతో ఈ సూత్రం ఇప్పుడు అక్కడ కూడా తప్పినట్లు కనిపిస్తోంది. సామ్యవాద సమాజం కుప్పకూలడంతో విముక్తి మతవేదాంతమే అంతర్జాతీయ ప్రత్యామ్నాయంగా కనిపించింది. అభద్ర సమాజ అనుభవాలు మత ప్రాముఖ్యతను పెంచుతాయి. సంక్షేమ రాజ్య సామాజిక భద్రత పరిస్థితులు మతప్రభావాన్ని తగ్గిస్తాయి. ఆర్థిక అసమానతలు బలంగా, గణనీయంగా మతానుకూల ప్రవర్తనలను విస్తరిస్తాయి. దేశ సాంకేతికాభివృద్ధితో సంబంధం లేకుండా ఉపాధిరాహిత్యం, ఉద్యోగ అభద్రత, అస్థిరత ఆధునికులను అలౌకికత్వం వైపు నడిపిస్తున్నాయి. సర్వసాధారణంగా అమెరికా, జపాన్, ఐరోపా దేశాలలో, ప్రత్యేకించి స్కాండినేవియన్ దేశాలలో ఆధునికత, మతతత్వం విలోమానుపాతంలో ఉంటాయి. భారత్‌లో అనులోమానుపాతంలో ఉన్నాయి. కొత్త యజ్ఞయాగాలు, పూజా విధానాలు, గ్రామదేవతల పూజారుల, పూజాపద్ధతుల మార్పు, నాగరిక పేదరికం, పట్టణీకరణ, ఆధునీకరణ, యాంత్రీకరణ, స్వాముల సంస్కృతి వైదికమత, అలౌకిక భావాల విస్తరణలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కొత్త పద్ధతులు. (ఇంకావుంది)

## నాస్తిక సమాజం జాతీయ పూర్వ అధ్యక్షులు కె. అయ్యన్న 6వ వర్ధంతి సభ



నాస్తిక సమాజం జాతీయ పూర్వ అధ్యక్షులు కె.అయ్యన్న 6వ వర్ధంతి సభ ది.28-07-2024 ఆదివారం సా॥ 5గంటలకు విజయవాడ స్వాతంత్ర్య సమరయోధుల భవనం నందు జరిగింది. ఈ సభకు నాస్తికసమాజం నాయకులు కె. కోటేశ్వరరావు స్వాగతం పలుకగా, వి.ఫణీంద్రకుమార్ అధ్యక్షత వహించారు. "లౌకిక రాజ్యము – మతము – దైవస్వరూపులు" అనే అంశంపై ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి ఉపన్యసించారు. తదనంతరం జరిగిన చర్చలో – విరసం నాయకులు అరసవెల్లి కృష్ణ, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు సృజన శ్రీను, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్. వెంకటేశ్వరరావు నాస్తికసమాజం నాయకులు బి.వెంకటరెడ్డి మొ॥వారు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి నాయకులు ఆర్. పిచ్చయ్య అభ్యుదయ గేయాలను ఆలపించారు.

# నాస్తిక చతురోక్తులు

శివశేఖర్ కాలెపు

ఇస్లాం మతం
శాంతి స్వేచ్ఛ సమానత్వం సహాయం
ఖురాన్‌లో సారాంశం అదే!
కానీ, జరుగుతున్నదేమిటి?
శాంతి : టెర్రరిజం
స్వేఛ్ఛ : స్త్రీలు ముసుగుల్లో
సమానత్వం : పర మత ద్వేషాలు
సహాయం : పేదలు ఎక్కువ

స్త్రీకి ఒక్కడే భర్త
మగాడికి 13 మంది
భార్యలు వుండొచ్చు
వీళ్ళు భార్యలా బానిసలా
ఇదేం ఇస్లాం ఆచారం?

దేవుడు వున్నాడనే
భ్రమలో బ్రతికే ప్రతివారూ రోగులే!
లేడని చెప్పి, ఋజువులు చూపించి
ఒప్పించే ప్రతివారూ వైద్యులే!!

దేవుడు ఎందుకు?
అగరబత్తీలు తైలం
కొబ్బరికాయలు హారతి కర్పూరాల్తో
ఇంటి బడ్జెట్ పెంచడానికి తప్ప
శ్లోకాలతో దీప ధూప నైవేద్యాలతో సమయం వృధా!

దేవాలయాలు ఎక్కువయ్యే కొద్దీ
మెట్లపై దరిద్రులు ఎక్కువౌతూనే వుంటారు
పుణ్యం పెరిగిందో
దారిద్ర్యం పెరిగిందో... తెలియని
అస్తవ్యస్త వ్యవస్థలో వుందీ భారతావని!

పుణ్య క్షేత్రాలంటూ
వేల వేల నిధులు కేటాయిస్తుంది ప్రభుత్వం
దారిద్ర్య నిర్మూలనకు
ఒక్క పైసా కూడా మంజూరు చేయదు
ఈ దేశంలో దేవాలయాలు
అభివృద్ధిచెందే కొద్ది
దారిద్ర్యమూ అంతకంటే వేగంగా
అభివృద్ధి చెందుతుంది

కోనేటి మురికి నీళ్ళలో స్నానాలు
పవిత్రమట!
నదుల పుష్కరాల్లో జలకాలు
పవిత్రమైనవట!!
కంపు కాలువల్లో మునకలు
పరమ పవిత్రమైనవట!!
దేవుని పేరుతో స్నానాలు
అంటువ్యాదులు ప్రబలితే..
ఆ దేవుడు వైద్యం చేస్తాడా లేక
కాటికి పొమ్మంటాడా?

ఓ బ్రహ్మా!
విశాలమైన భూమండలంపై
అనేకనేక జీవరాశులు వున్నాయి
నీవు మాత్రం మనుష్యుల బొమ్మల్నే
మాన్యుఫాక్చర్ చేస్తుంటావు
మరి! సకల జంతు జీవ జలచరాలను
ఎవరు తయారు చేస్తున్నారు?

ఓ విష్ణుమూర్తి
నీ శరీర వివిధ అంగాంగాల్లోంచి
మనుష్యులు పుట్టారు
వారికి కులాలను అంటగట్టావు మరి!
ఈ భూమ్మీద తిరిగాడే మూగజీవుల్ని
ఏ అంగము నుండి పుట్టించావో
చెప్పలేదేమయ్యా!

ఓ శివా
అర్ధాంగి పార్వతి నీ శరీరంలో
అర్ధభాగం అయితే... మీ యిరువురి

అంగంగాలు కూడా అర్ధభాగమే
ఔతాయి కదా
ఇది సాధ్యమేనంటావా?
అప్పుడు నెత్తినవున్న గంగ పరిస్థితి ఏమిటి
ఇది నమ్మశక్యం కాని పురాణం కాదా శివా?

శివుని తలపై గంగ
బంధించబడింది జటాజూటంలో
స్వేచ్ఛ లేని జీవితం
నరుల కోసం ట్వంటీఫోర్ హవర్స్
నీరు సప్లై చేయవలసిందేనా
నీ దీనస్థితికి నీ భర్తే
జాలిపడడం లేదు... గంగా!

ఓ పార్వతీ
సున్నిపిండితో వినాయకుడ్ని చేసి
నీ స్నానాల గదికి కాపాలాగా వుంచావ్
అంతకుముందు నీ బాత్‌రూమ్‌కి
కాపాలాదారుడు ఎవరూ లేరా
మరప్పుడు ముందు రోజుల్లో
నీవెప్పుడూ స్నానం చేయలేదా?

ఓ ముక్కంటి
పతి సంభోగం లేకుండా
నీ భార్య గణపతికి జన్మనిచ్చింది.
ఇదెలా సాధ్యమో నీకు తెలీలేదా?
పైగా పసివాడి తలనరికావ్
నీవు నరికిన తల నీకే కనిపించక
ఏనుగు తల అతికించావ్... ...
ముల్లోకాలు చూడలేని వాడివి...
నీకు మూడు కళ్ళు ఎందుకయ్యా?

శివుని ఆజ్ఞ లేనిదే
చీమైనా కుట్టదంటారు.
గణపతి తల ఖండించావు
అది నీ ఆజ్ఞేనా
ఏనుగు తల నరకించావు

అదీ నా ఆజ్ఞే కదా
ఇవన్నీ నీకు ముందుగానే
తెల్సున్నప్పుడు...
బాలుడి తల నరకడమేమిటి
ఏనుగును చంపడమేమిటి?

ఫలానా నక్షత్రపు ఘడియల్లో
జననం జరిగిందని,
పంచాంగాలు తిరగేసి జాతక చక్రాలు
చెకచెకా లిఖించే ఓ సిద్ధాంతులూ
ఫలానా నక్షత్రపు ఘడియల్లో
పుట్టిన వాడికి మరణం సంభవిస్తుందని
ఎందుకు వ్రాయలేకపోతున్నారు?

మతం వున్నంతకాలం
మారణహోమం జరుగుతూనే వుంటుంది
నరులు నరులు నరుక్కుంటారు
లేని దేవుని కోసం
ఉన్న మనుష్యులు
చంపుకోవడమే మతోన్మాదం!

ఉనికిలో లేని
మత దేవుళ్ళ కోసం
ఉనికిలో వున్న
మనుషులు ఒకర్నొకరు
ద్వేషించుకుంటూ తిట్టుకుంటూ
కొట్టుకుంటూ చంపుకుంటూ
ప్రవర్తించడమే...
మత మూర్ఖత్వానికి పరాకాష్ట!

ఏ దేవుడూ
ఏ యుద్ధాన్ని ఆపలేకపోయాడు
ఒకడు స్వర్గలోకంలో కూర్చుంటాడు
మరొకడు పరలోకంలో కూర్చుంటాడు
ఇంకొకడు పవిత్రలోకంలో కూర్చుంటాడు
శవాల గుట్టల్ని చూడ్డం తప్ప

ఏ దేవుడూ దిగి రాలేదు... రాడు..లేడు కూడా
ఏమీ చేతగాని వాడు దేవుడు ఎలా అయ్యాడు
ఎందుకు నమ్ముతున్నారు?

ఎక్కడైనా ఎప్పుడైనా ఏమైనాగానీ
మనిషి వల్ల ప్రపంచానికి ప్రమాదం లేదు
మతం చాటున కొందర్ని వున్మాదులుగా
తయారు చేసిన మతాలదే ఆ నేరం అంతా,
నరమేధాన్ని సృష్టించే శక్తి మతాలకే వుంది!

దైవ భావన ఓ అంటురోగం
ఇది యేనాడో ప్రపంచాన్ని కబళించేసింది
మొదట మెదడులోకి చొరబడుతుంది
ఆ పై నరనరాలకూ వ్యాప్తి చెందుతుంది
ఈ రోగం బారిన పడిన వారిని
పాడె ఎక్కేంత వరకూ,
పాడు చేస్తూనే వుంటుంది!

స్నానం చేయడం చేతకాదు
అయినా! చక్రస్నానం చేస్తాడు
బట్టలు కట్టుకోలేడు
అయినా! పట్టు వస్త్రాలు కావాలి
మేకప్పు వేసుకోలేడు
అయినా! ఎవరో నామాలు పెట్టాలి
స్వతహాగా అంబారీ ఎక్కలేడు
అయినా! పురు వీధుల్లో రకరకాల
వేషాలతో వూరేగుతుంటాడు
ఆ ప్రతిమకు చూపులేదు, శబ్దం వినలేదు,
తినలేదు, నడవ లేదు
జీవంలేని ప్రతిమకు యీ హంగులు ఎందుకు?

దేవాలయం అనే సిన్మాహాల్లో
దేవుడు హీరో
భక్తులు టికెట్లు కొనుక్కుని
మరీ మరీ చూస్తుంటారు
రాతిబొమ్మకు
ఫ్యాన్స్ ఎక్కువ
రాబడి మరీ ఎక్కువ
ఇది ఎప్పటికీ ఫ్లాప్ కానీ మూవీ!

ఒక రాయి
కాలివ్రేలుకు తగిలి గాయం చేస్తే
తిట్టుకుంటారు.
మరో రాయి
గుడిలో వుంటే మ్రొక్కుకుంటారు
స్థాన చలనం బట్టి రాయికి
మహిమలు వుంటాయా
మానవా! ఏదీ తెలుసుకోవా?

రోడ్డు ప్రక్కన వున్న
రాయిపై మూత్రం పోస్తే
పాపం కాదు
అదే రాయికి
పసుపు కుంకుమలు పూస్తే
దేవుడు ఔతాడు
దణ్ణం పెడితే పుణ్యం వస్తుంది!
రాయి ఒక్కటే
వేషం మారింది... అంతే!

ముందు సుప్రభాతాలు
కుడి ఏసయ్య ప్రార్థనలు
ఎడమ అల్లా బిగ్గర నమాజులు
వెనుక సాయి భక్తి సంచార వాహనం
ఎటుచూసినా భగవంతుని స్మరణలే
అతి ప్రమాదకరంగా.. ...
ఎటు చూసినా భక్తి కాలుష్యం నిండిపోయింది.

ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో
అక్కడ దేవతలు ఆనందంతో
నాట్యం చేస్తారు.... ఆర్యోక్తి
ఎక్కడైతే స్త్రీలపై అత్యాచారాలు జరుగుతాయో
అక్కడ దేవతలు నీలి చిత్రాలు చూస్తూ
చిందులు వేస్తారు ... మృగోక్తి

# మెదడు కలిగించే గందరగోళం

**- డా॥ కొడవటిగంటి రోహిణీ ప్రసాద్**

మన మనస్సులో కలిగే భావనలన్నిటికీ మెదడు నిర్మాణమూ, అది పనిచేసే విధానాలే ఆధారం. మెదడులోని వివిధ భాగాలు వేరువేరుగానూ, కలిసికట్టుగానూ మనకు కలిగించే అనుభవాలే మనకొక మనస్సు ఉందని అనిపిస్తాయి. మెదడులోని "ఉన్నత" కార్యకలాపాలు అందులోని ఏ భాగంలో, ఎలా జరుగుతాయో ఇంకా మనకు సరిగ్గా తెలియదు. అంత మాత్రంచేత మెదడూ, మనస్సూ (లేదా బుద్ధి) వేరువేరనీ భావించి, ఆ ధోరణిలో సైన్సుకు "అతీతమైన" విషయాలను గురించి ఊహించడం మంచిది కాదు. ప్రాణుల శరీరాలన్నీ జీవరసాయనిక కణాలతో నిండినవేనని పరిశోధనల ద్వారా ఋజువవుతోంది. కనుక శరీరప్రక్రియల్లోని "మిస్టరీ" నానాటికీ తగ్గిపోతోంది. అందువల్ల శరీరంలో ఒక భాగమైన మెదడు గురించి కూడా భౌతికవాద దృష్టితో సహేతుకంగానే అర్థం చేసుకోవాలి.

డార్విన్ పరిణామవాదాన్ని ఈనాడు ఎవరూ శంకించరు. తొలివృక్షజాతి ఏకకణ జీవుల నుంచి జంతుజాతి కణాలూ, చిన్నచిన్న జలచర, ఉభయచరాలూ, బల్లులూ, ఇతర జంతువులూ, కోతులూ, వానరాలూ, మనుషులూ వీటన్నిటికీ శరీరభాగాలలో క్రమంగా కలుగుతూ వచ్చిన మార్పులూ ఇవన్నీ చూస్తే ప్రాణులన్నిటికీ "కుదురు" ఒక్కటేనని తెలుస్తోంది. మరి మనిషి మెదడుకు ప్రత్యేకత ఎప్పుడు కలిగింది? సుమారు 28 లక్షల సంవత్సరాల కిందట మనిషి పూర్వీకుల్లో మెదడుకు సంబంధించిన జన్యువు (జెనిటిక్) మార్పు కలిగింది. గత 30-40 లక్షల ఏళ్ళలో మనిషి మెదడు పరిమాణం 400 సి.సి (ఘన సెంటీమీటర్లు) నుంచి 1400 సి.సి.లకు పెరిగింది. ఇది కేవలం శరీరం పెరగడానికి సంబంధించినది కాదు. గతంలో ప్రకృతిలోనూ, పరిసరాల్లోనూ, వాతావరణంలోనూ కలిగిన బలమైన మార్పుల కారణంగా వానరాల్లోని ఒక శాఖ రెండుకాళ్ళ మీద నడుస్తూ, ఆహార సేకరణ నిమిత్తం రెండు చేతులతో రాతి పనిముట్లు చేసుకోవలసిన అగత్యం ఏర్పడింది. శరీరంలో వివిధ అవయవాలను నియంత్రించేందుకు మెదడులో వివిధ భాగాలున్నాయి. క్రమంగా మనుషులు చిన్న తెగలుగా, ముఠాలుగా ఏర్పడి జీవించడం, వేటాడటం తప్పనిసరి అయింది. ఈ చర్యలు కూడా మెదడులో ఎన్నడూలేని మార్పులు కలిగించి, మనిషి జాతిని జంతుదశ నుంచి ముందుకు నెట్టాయి. పెద్ద మెదడు పైన ముడతల పొర ఈ కొత్త నేర్పులన్నిటినీ ప్రతిఫలించింది.

ఈనాడు పుట్టినప్పుడే శిశువు తల పెద్దదిగా ఉంటోంది. తల గర్భద్వారం నుంచి బయటపడే సమయంలో కాన్పులో యమబాధకు గురిఅయ్యేది మనుషులే. తక్కిన జంతువులకు ఈ సమస్య ఉండదు. మునుపటికన్నా సిజేరియన్ పద్ధతిలో పిల్లలు పుట్టడం ఈనాడు సామాన్యమైందంటే అందుకు శస్త్రచికిత్సలో అభివృద్ధితో బాటు తల పరిమాణం పెరగడం కూడా ఒక కారణం కావచ్చు. సర్దుబాటుకు వీలుగా పుట్టినప్పుడు పుర్రెలోని పగుళ్ళు పూర్తిగా మూసుకుని ఉండవు కూడా. ప్రసూతి సమయంలో మెదడు నొక్కుకు పోతున్నప్పుడు కలిగే బాధ (ట్రామా) మనసు లోపలిపొరల్లో జీవితమంతా గుర్తుంటుందనీ, వెచ్చని ద్రవంతో నిండి, చీకటిగా ఉండే గర్భం

నుంచి అకస్మాత్తుగా వెలుతురుండే పొడి వాతావరణంలోకి రావడం ఒక షాక్ అనీ కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. చావుకు తాత్కాలికంగా దగ్గరైనవారు చీకటి సొరంగం వెలపల కాంతిరేఖలను చూసినట్టు చెపుతారంటే దానికీ దీనికి సంబంధం ఉండవచ్చునని వీరి ఊహ. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఆదిమానవుల్లో మెదడు పరిణామం పెరుగుతున్న దశలోనే ఆడవారి కటి ఎముకలు వెడల్పు కావడం కూడా మొదలైంది. డార్విన్ సిద్ధాంతం ప్రకారం ఇటువంటి జతలవారీ మార్పులు యాదృచ్ఛికంగా కలిగిన వ్యక్తులే ఎక్కువగా బతికి బట్టకట్టడంతో ఈ లక్షణాలు సంక్రమించిన వారి పిల్లలు "వంశోద్ధారకు" లయ్యారు, తల సైజు పెరగడం, మెదడు బరువు పెరగడం మాత్రమే కాదు. ముందాలోచనకూ, అవగాహనకూ, భాషకూ, మనుషులకు ప్రత్యేకమైన ఇతర శక్తులకూ దోహదపడే మెదడు భాగాలన్నీ మనుషుల్లో మాత్రమే పెరిగి అభివృద్ధిని సాధించాయి.

వానరాల్లాగ కాకుండా మనిషి ముఖం చిన్నదై, మెదడు దాని పైభాగానికి చేరింది. కేవలం గింజలనూ, ఆకులలములనూ నమలగలిగిన దవడలు, దంత నిర్మాణమూ మారి మనిషి నాలుకకు నోట్లో స్వేచ్ఛగా మసిలేందుకు అవకాశం ఏర్పడింది. మనిషి మాటలు నేర్చాడు. ఎంతో తెలివి కలిగిన చింపాంజీ పిల్లలకు కొందరు పరిశోధకులు కష్టపడి మూగవారి సంజ్ఞల భాష నేర్పగలిగారు. కానీ మనలాగా మాట్లాడేందుకు వాటికి శారీరక ప్రతి బంధకాలున్నాయి. అరుపులు, పొలికేకలు, మూలుగుల దశ దాటి మాట్లాడనేర్చిన మానవ సమూహాలలో సామాజిక పరిణామం అతివేగంగా జరగడంలో ఆశ్చర్యం లేదు.

సైన్స్ రచయిత కార్ల్ సేగన్ "డ్రాగన్స్ ఆఫ్ ఈడెన్" అనే తన పుస్తకంలో మన మెదడులో ఉన్న ఇన్ఫర్మేషన్ను లెక్కగట్టడానికి ప్రయత్నించాడు. బాక్టీరియా నుంచి మనిషిదాకా ప్రాణులన్నీ జన్యువుల ( జీన్స్) సముదాయాలే. వీటిలోనూ, వీటి బయటా నిక్షిప్తమైన సమాచారమే (ఇన్ఫర్మేషన్) వాటి మనుగడకు ఆధారం. మనిషి క్రోమోజోమ్లో జీవకణాలకు మూలమైన డిఎన్ఎ కణాలు అతి సూక్ష్మమైన తాటి నిచ్చెనల్లాగా మెలితిరిగి ఉంటాయి. వీటిలో ఉన్న ఎ (adenine) సి(cytosine) టి (thymine) జి (guanine) అనే అయిదువందల కోట్ల జీవరసాయన అణువులే నాలుగక్షరాల వర్ణమాలగా జీవకణాల "వర్ణన" సాధ్యపడుతుంది. కంప్యూటర్ పరిభాషలో ఇది రెండువేల కోట్ల "బిట్స్" కు సమానం. ఇదికాక కన్నవీ, విన్నవీ బోలెడు విశేషాలుంటాయి. అవన్నీ కథలూ, గాథలుగా కొత్త తరాలకు చెప్పడం మొదలయింది. మనుషులకు మెదడుతోబాటే మతిమరుపు కూడా వచ్చింది. కనక ఈ విషయాలను గ్రంథస్తం చెయ్యడం మామూలయింది. పుస్తకాలే అరుదైన యుగాల్లో గ్రంథస్తమైన జ్ఞానం ఎంతో అపూర్వకంగా భావించడం వల్లనే భగవద్గీత, ఖురాన్, బైబిల్, గురుగ్రంథ్ సాహిబ్ వంటివి పవిత్రం అయ్యాయి. వాటిని అడ్డుపెట్టుకున్న ఛాందసవాదులు ఈనాటికీ సామాన్యుల జీవితాలతో చెలగాటాలు ఆడుతూనే వున్నారు. మరి ఈనాడు సినిమా, రేడియో, టీ.వీ., రికార్డూ, టేపూ, సీడీలూ వగైరాల్లో భద్రపరచబడుతున్న "జ్ఞానం" లేకుండా మనకు పూట గడవటం లేదు. తక్కిన జంతువులను దాటి మనం ఇంత ముందుకు వచ్చామంటే ఈ ఇన్ఫర్మేషన్ వల్లనే కదా. ప్రజలను అణచడానికీ, వీటిని దుర్వినియోగం చేసుకోవడానికీ, వీటిని "కళ్ళకద్దుకోవడానికీ" కూడా ఈనాటి ప్రభుత్వాలు వెనకాడటం లేదు.

# "మరియమ్మకు ప్రధానం" - జె.సత్యవాది

**అ**ది రాజుల పరిపాలన గలిగిన యూదయ దేశము. హీరోదు అను నాతడు రాజుగా చలామణి అవుతున్న రోజులవి. రాజుకు సలహాల నిచ్చువారిని ప్రధాన యాజకులని అంటారు. ప్రజలలో నివసించేవారు శాస్త్రులు - ఫెరిజేయులు, ఇది ధనికవర్గం - రాజు అప్పుడప్పుడూ కొన్ని సమావేశాలకు వీరిని కూడా ఆహ్వానిస్తూ వుంటారు. వీరందరికీ యూదులు బానిసలు, ఫెరోరాజు కాలంలో యూదులు ఒక్కొక్కడూ రోజుకు వెయ్యి ఇటుకలు చేసి చూపించవలసి యుండెడిది. అయితే కాలం మారుతున్నకొలదీ మానవునిలో కూడా మార్పువస్తూ వుంటుంది. బానిసల్లో కూడా తిరుగుబాటు భావం కనపడసాగింది. అది రోజు రోజుకూ పెరిగిపోతూ వుండటం రాజులు గుర్తించకపోలేదు. దానికితోడు యూదుల సంతానం కూడా పెరిగిపోవటం కనిపిస్తుంది. రాజుల వంశాలు సన్నగిల్లుతున్నయ్. మరికొంత కాలానికి యూదుల సంఖ్య పెరిగి రాజుల సంఖ్య తరిగేటట్లుగా కన్పడుతూ వుంది. రాజు ప్రధాన యాజకుల సలహాతో శాస్త్రులను - ఫెరిజేయులను సమావేశపర్చాడు. ముందు ముందు యూదులు సింహాసనం కొరకు తిరగబడే పరిస్థితి గురించి చర్చించారు. ఈ విపత్తును ఆపటానికి ఆలోచన ప్రారంభించారు. ఇప్పటివరకూ సింహాసనం మీద కూర్చుని సుఖం అనుభవిస్తూ అధికారం చెలాయించిన హీరోదుకు యూదుల జనసంఖ్యను చూస్తుంటే చెప్పలేనంత భయం పట్టుకుంది. పదవులకు ఏ ముప్పు వాటిల్లుతుందోనని ప్రధాన యాజకులు ఉపవాసాలు మొదలు పెట్టారు. ఆస్తులు ఏమైపోవునోయని శాస్త్రులకూ ఫెరిజేయులకూ మనోవ్యాధి ఎక్కువయిపోయింది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వారికి సంజీవిని దొరికినట్లుగా ఒక ఆలోచన తట్టింది. యూదయ దేశంలో ప్రజల జనసంఖ్య తెలిసికొనుటకు ఆర్డర్లు జారీచేశారు. జనాభా లెక్కలు వ్రాయించారు. వారనుకొన్నట్లు యూదుల జనసంఖ్య అపారంగా వుంది. దీన్ని అరికట్టాలంటే కుటుంబ నియంత్రణ యూదులలో ప్రవేశ పెట్టాలి. ఇక నుండి యూదులు పిల్లల్ని కంటానికి వీలులేదు. ఒక వేళ కన్నా బ్రతక నివ్వరాదు. ఒక వేళ బ్రతికినా పెరగనివ్వకూడదు. ఇదీ మంత్రం.

ఈ విషయం ప్రజలకు అంటే యూదులకు తెలిసింది. గర్భిణీతో వున్న స్త్రీలకు శ్రమకలిగే రోజు వచ్చిందని బాధపడ్డారు. అందుకు జాగ్రత్త పడవలసినదిగా వారిలో కొందరు జ్ఞానము గలవారు నాయకత్వం వహించి ప్రచారం చేయడం మొదలు పెట్టారు. ఈ నాయకులు రాజుకు వ్యతిరేకులయ్యారు. అందువల్ల రాజుకు వారిమీద ఆగ్రహం కలిగింది. అట్టి వారిని తిరుగుబాటుదార్లుగా ప్రభుత్వం ముద్రవేసింది. వారిని పట్టి చెరసాలలో వేయవలసినదిగా రాజాజ్ఞ జారీ చేయబడింది. నాయకులు రాజశాసనాన్ని ధిక్కరించి తమ ఇండ్లలో వుండడం మానివేసి కొండలలోనూ అడవులలోనూ సంచరించుచూ వారి అనుయాయుల ద్వారా ప్రజలలో రాజుకు వ్యతిరేకంగా ప్రచారం మొదలుపెట్టారు.

జ్యాకీను అన్నమ్మల పుత్రిక మరియమ్మ. గుడిలో పెరుగుతూ వుంది. ఎందుకంటే చిన్న తనములోనే ఈమెను గుడికి కానుకగా ఇచ్చివేశారు. ఆమె ఆ దేవాలయంలోనే కాలం గడుపుతూ వుంది. ఇప్పటిలాగ అప్పుడు కూడా దేవాలయములకు కొన్ని ఆస్తులు వుండేవి. గుడిలో వుండే పూజారులు ఆ ఆస్థిని అనుభవిస్తూ వుండేవారు. ఇటువంటి పరిస్థితులలో మరియమ్మకు యుక్త

వయస్సు వచ్చింది. హీరోదు రాజుచేత నిగ్రహితులయిన వారు పగలు ఎలాగో కొండల్లో, అడవుల్లో కాలం గడిపి రాత్రులందు వారి గ్రామాలలో సంచరిస్తూ వుండేవారు. ఇటువంటి వారు దేవాలయాలలోనికి అరుదుగా రావడం జరుగుతుంది. ఎందుకంటే దేవాలయాలు పవిత్రమైన స్థలాలనీ అటువంటి ప్రదేశాలకు రాజభటులు రారు అని వారి నమ్మకం. ఈ పరిస్థితులలో యూదులు తిరుగుబాటు వీరులలో ఎవరో మరియమ్మతో సంబంధం పెట్టుకొని వున్నారు. దేవాలయాలలో వున్న ఫలహారాల కోసమో లేక సమాచారం కోసమో వస్తూ వున్నవారు ఎవరో మరియమ్మతో సంబంధం వుండి వుండాలి. అందువల్లే ఆమె గర్భవతి అయ్యింది. ఆమెకు గల సంబంధం ఎవ్వరికీ తెలియదు. అంటే అది పరిశుద్ధాత్మ తల్లీ తండ్రిలేని బిడ్డలను మనం దేవునిబిడ్డలు అంటూ వుంటాం. అలాగే మరియమ్మకు గర్భం ఎవరివల్ల వచ్చిందో తెలియదు గాబట్టి దాన్ని పరిశుద్ధాత్మ అన్నారు. అంటే మనం లెక్కలలో తెలియని దానిని 'ఎక్స్' అనుకొనుము అని చెప్పినట్లు.

మరియమ్మ బంధువులంతా సమావేశమయ్యారు. ఏదో విధంగా వివాహం చేయవలెనని నిశ్చయించారు. వడ్రంగి పని వాడైన జోజప్ప అనునాతనిని పెండ్లికి వప్పించారు. ప్రధానం జరిగింది, అయితే అప్పటి వరకూ జోజప్పకు ఆమెను గురించి ఏమీ తెలియదు. ప్రధానం జరిగిన కొద్ది రోజులకే అమ్మ లక్కల ద్వారా మరియమ్మ గర్భవతియని యోసేపుకు తెలిసింది. ఎలా తప్పించుకోవాలా! అని ఆలోచనలో పడ్డాడు.

అతడు ఈ సంగతులను గూర్చి ఆలోచించు చుండగా ప్రభువు దూత అతనికి స్వప్నమందు ప్రత్యక్షమై "దావీదు కుమారుడైన యోసేపూ! నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము. ఆమె గర్భము ధరించినది, పరిశుద్ధాత్మ వలన కలిగినది." (మత్తయ్య 1 :20)

అతడు పగలంతా జమిందారు గారి క్రొత్త ఇంటికి, కిటికీలు, తలుపులు చేసి, సాయంత్రం భోంచేసి, హాయిగా నిద్రపోతున్నాడు. పెద్దతనం వచ్చింది. అందులో ఇల్లు త్వరగా పూర్తి చెయ్యాలని ఎక్కువగా పనిచేసి వున్నాడేమో అలసిపోయి గాఢనిద్రలో వున్నాడు. గాబ్రియేలు అను పెద్దమనిషి వచ్చి అంత నిద్రలోవున్న యోసేపును లేపాడు. "ఈ లోకంలో తప్పు చేయని మనిషిలేడు. ఏదో ఒక విషయంలో ప్రతివాడూ తప్పు చేస్తూనే వుంటాడు. ఆ తప్పును సరిదిద్దుకొనుటలో మనిషి యొక్క గొప్పతనం బయటపడుతుంది. మనిషిగా పుట్టినవాడు కాదు గొప్ప. మనిషిగా బ్రతికినవాడు గొప్పవాడు. మరియమ్మ చాలా ఉత్తమురాలు, దేవదాసీగా పెరిగింది. గనుక నీకు అన్ని విధాలా సరిపోతుంది. చిన్నపిల్ల కూడాను. ఈ సంబంధం వదులుకున్నావంటే మళ్ళీ నీకు పెండ్లి అవడం చాలా కష్టం. వయసు కూడా ముదిరిన వాడివి. నీ ముఖం ఎప్పుడయినా అద్దంలో చూసుకున్నావో లేదో? ముదిరిన ముఖానికి తోడు ఆ గడ్డం అబ్బ చాలా పెద్దవాడివిలా కన్పడుతున్నావు – ఆమె తప్పితే అంత చిన్న పిల్లలు నీకు పెండ్లి చేసుకోడానికి దొరకరు." "నాలుగు అబద్ధాలు ఆడి అయినా ఒక పెండ్లి చెయ్యమన్నారు" అని ఘనకార్యం చేసినవాడి లాగా మాట్లాడి చక్కగా వెళ్ళిపోయాడు.

కంగారుగా నిద్రలేచి విన్నాడు గాబోలు కాసేపు కండ్లు నులుపుకుంటూ చూసేసరికి అక్కడ ఎవ్వరూ లేరు. కల గాబోలు అనుకున్నాడు. కంట్లో వేలుపెట్టి పొడుచుకున్నాడు. అబ్బ, నిజమే, నీళ్ళు గారుతుంది కలగాదుగా! అనుకున్నాడు – గాబ్రియేలు చెప్పింది బాగానే వుంది – నిజమే చెప్పాడు – కలిసొచ్చే రోజులుంటే నడిచొచ్చే కొడుకు పుడతాడు –" అని పెద్దలు చెప్పారు.

*(చార్వాక పత్రిక అక్టోబర్ 1976)*

# కులాల కతీతుడైన దళితుల కవి జాషువా

- క్రాంతి కిరణ్

**వాస్తవ జ్ఞాన సంపత్తి ఖూనీ చేయు**
**గాథలు, జీర్ణంబుగావు నాకు**
**ఒక జాతి శ్రేయస్సునకు సాయమొనరించు**
**కపట సంస్థలు, నాటకములు నాకు**
**అనుభవంబునకు గిట్టని నభః కుసుమ వే**
**దాంతముల్, ప్రబల స్వార్థములు నాకు**
**ప్రజల రక్తంబు నాస్వాదించు రాజకీ**
**యములు, గుండెలకు భారములు నాకు**

**సహజమైన ప్రకృతి సౌఖ్యంబు లొక వ్యక్తి**
**దొంగిలించి మనుట దొసగు నాకు;**
**నిఖిల లోకమెట్లు నిర్ణయించిన, నాకు**
**దరుగు లేదు; విశ్వనరుడనేను!**

అని తన గురించి తాను ఇలా చెప్పాడు జాషువా. సెలైన్ సీసాలు దొరికే రోజులలో కూడా-లేత కొబ్బరి బోండాలనే సెలైన్ సీసాలుగా ఉపయోగించిన ఆధునిక సాంప్రదాయ సాహితీ వైద్యుడు, గుఱ్ఱం జాషువా. సాంప్రదాయ సాహితీ రీతులను ఆకళింపు జేసుకొని, ఛందశ్శాస్త్రంలో అనన్య ప్రావీణ్యతను పొంది, తెలుగు భాషను 'వృత్తాల'లో హృద్యంగా మలచి, సామాజిక రుగ్మతల్ని తనదైన శైలిలో పద్యరీతుల్లో పల్లవించిన దళిత కవికోకిల గుఱ్ఱం జాషువా గారనటంలో అతిశయోక్తి లేదు.

దళిత కులంలో పుట్టిన జాషువా అందరిలాగే ఆ రోజుల్లో అనేక అవమానాలకు గురైనాడు. పొందిన అవమానాలకు క్రుంగిపోలేదాయన. ఆవేదన నుండి శోధన ప్రారంభించాడు - ఆ శోధనలో నుండి ఆయన హృదంతరాళాలలో నుండి ఆయన 'శుభ రక్తనాళాల లోంచి' ఆయన ఆవేదనలు అక్షర రూపాలు దాల్చాయి. పద్యాలై ప్రవహించాయి. కావ్యాలై నిలిచాయి.

ఐతే ఛాందస భావాలు ఓ పరంపరగా ఆయన కవిత్వం నుండి వెలువడలేదు. అట్లని ఛాందస భావాలు కూడా చోటు చేసుకోలేదు. నాటి సామాజిక రుగ్మతల పట్ల అనేకమంది కవులు స్పందించినట్లే స్పందించారు. గరిమెళ్ళ, దువ్వూరి, ఏటుకూరి వెంకట నరసయ్య, తుమ్మల, త్రిపురనేని, దాశరథి-ఇలా ఆనాటి కవులలోని సామాజిక భావజాలమే ఈయనలో కూడా ప్రస్ఫుటంగా కన్పించింది. ఆనాటి స్వాతంత్ర్య పోరాటం, అందునా గాంధీ కాంగ్రెస్ పార్టీ సాగించిన 'స్వాతంత్ర్య' పోరాటం, ఆ రోజుల్లో జాతీయ భావాలను ఏ మేరకు చొప్పించగలిగిందో, ఆ మేరకు జాషువా స్పందించారనేది సుస్పష్టం.

గాంధీవాదిగా-గాంధీ సాగించిన హరిజనోద్ధరణ, మద్య నిషేధం, అహింసా సిద్ధాంతం, స్త్రీ విద్య ఇత్యాది ఉద్యమాల స్ఫూర్తిని నింపుకొన్న ఓ సాంఘిక కవి మూర్తిగా జాషువా గారు

రూపుదిద్దుకొన్నారు. ఐతే ఆయన కాలంలోనే ప్రపంచ రూపురేఖల్ని సమగ్రంగా సమూలంగా మార్చడానికి ఉవ్వెత్తున లేచిన 'వర్గపోరాట దృక్పథం' మాత్రం' ఆయన చెంతకు చేరకపోవడం నిజంగా ఆశ్చర్యమే!

దళిత కులంలో పుట్టిన జాషువా దగా పడ్డ తన తోడి జనాన్ని గూర్చి 'ఉపరితల రుగ్మతల్ని' గాంధేయవాదిగా చూశాడు గానీ, అంతరంతరాల్లో అణగారి ఉన్న అసలైన రుగ్మతల్ని 'వర్గ' దృక్పథంతో చూడలేకపోయారు.

ఆయన సాహిత్యాన్ని పరిశీలిస్తే జీవితాన్ని పరిశోధిస్తే, ఏ వర్ణం వారైతే తనను అంటరానివానిగా అవహేళన చేశారో–

**ధరణీసురు నిల్లాలిన్**
**చెఱబట్టినవాని కై తలల్లిన వానిన్**
**నరికిన పాపము లేదని**
**పురాణయుగ ధర్మసూత్రములు ఘోషించున్**

అని ఏ ధర్మ సూత్రాలు ఘోషించాయో వాటిని వాటి పద్ధతిలోనే ఎదిరించి నిలవాలనే తపన, ఆయనను ఛందోబద్ధమైన పద్య ప్రక్రియవైపు నడిపించి ఉండవచ్చు. అందుకోసం తన జీవితాన్నంతా ఓ తపస్సుగా మార్చిన వైనం ద్యోతక మవుతుంది. ప్రతిభ ఒకరి సొత్తు కాదని నిరూపించడానికి సాహితీ రంగంలో ఓ మహా యజ్ఞం సాగించి, సాధించిన ప్రతిభ మన ముందు ప్రత్యక్షమవుతుంది. పండితులకే, పండిత కుటుంబాలకే పరిమితమైనదనిన పద్య సాహితీ రీతిని తన పాదాలచెంత తోకాడించే పెంపుడు కుక్కగా మార్చుకోడానికి ఆయన పడిన తపన, సాగించిన పరిశ్రమ ఇంతింత కాదు.

**"గణ బాధ రవ్వంత గడచి........"**
**"యతిని మచ్చికజేసి యడుగు ముందుకు సాగి...."**
**"ప్రాస వేదన దాటి....."**
**"భావంబు పొసగించి......."**
**"వ్యాకర శాస్త్ర మాదరం పొంది......"**
**"శబ్ద మర్యాదలు పాటించి...."**

"యతులుంబ్రాసలు బుఱ్ఱలోన సకల వ్యాపారముల్ మాన్పి శాశ్వత సంచారము" చేయించి కవిత్వమే తన జీవితంగా, పద్య రచనే తన సాహితీ జీవనంగా సాగించారాయన, భావ గాఢత పేరుతోనూ, జీవన సంక్లిష్టత పేరుతోనూ నేడు వస్తున్న దళిత, దళితేతర 'కవితల కంటే వృత్త ఛందస్సులో వ్రాసినప్పటికీ సామాజిక రుగ్మతల్ని సులభ గ్రాహ్యంగా, తేలికగా చెప్పగలిగారు. ఆ కాలంలో బ్రాహ్మణ కులంలో పుట్టిన ఏ పండితునికీ జరగని రీతిలో అనేక సన్మానాలు పొందారు.

"ఎలమిన్ నన్ను గజేంద్ర వాహనమున నూరేగించి బంగారు మువ్వల పెండారము కాలికిందొడిగి సంభవించి పూజించి" నారని ఎంతో సంబరపడ్డారాయన.

**......మధుర**
**శ్రీనాథుండనెడి బిరుదుచేతను నను స**
**న్మానించినారు తిరుపతి**
**లోనన్ వైష్ణవ కవీంద్రులుం బండితులున్ అని ఆనందించారాయన.**

"సత్కవీ, ప్రసిద్ధుడు, వీర శతావధాని, ఆంధ్రుల శుభరక్తనాళముల రూపము నెత్తిన బ్రాహ్మణుండు," అయిన చెళ్ళపిళ్ళవారు బెజవాడలో జాషువాగారి పాదానికి గండపెండేరం తొడగగా, నా జీవితానికి "ఇంకేమి కావలె?" అని 'సంతుష్ట స్వాంతు'లైనారు జాషువాగారు.

అంటరానితనం అగ్రాసనం వేసుకు కూర్చొన్నా ఆ కాలంలో-బ్రాహ్మణ పండితులచేతే 'శెహభాష'నిపించుకొని, వారితో అనేక సన్మానాలు జరిపించుకొన్నారాయన. వివేకానందుడు చెప్పినట్లు-గుణత్రయ విభాగం ప్రకారం - సాంస్కృతిక వికాసమే బ్రాహ్మణత్వమైతే-దళిత కులంలో పుట్టి బ్రాహ్మణకులంలో తేలిన 'దళిత బ్రాహ్మణుడు' జాషువా గారనుట అతిశయోక్తి కానేరదు.

**అంటరానితనంపై తరగని ఆవేదన:**

జాతీయోద్యమ కాలంలో తన సమకాలీన కవులలానే అనేక సామాజిక సమస్యలపై స్పందించినప్పటికీ అంటరానితనంపై ఆయన కలం నిరంతరావేదనల్ని వెళ్ళకక్కుతూనే ఉండేది. అంటరానివానిగా పుట్టిన జాషువా కవిత్వాన్ని అమృతంగా కురిపించేవారు- కవిత్వాన్ని విని "శభాష్" అన్నవారే- నీదే కులం అని అడిగి తక్కువగా చూచేవారు. దానికీ ఆయన హృదయం తల్లడిల్లిపోయి తీవ్ర వేదనకు గురై ఆయన మాటల్లోనే చెప్పాలంటే "హృదయమును బాకున క్రుమ్మినట్లయ్యేది! మూగగా రోదించేది. ఆ రోదనా వేదనల్లోంచి జనించినదే "గబ్బిలం" అనే కావ్యం. ఒక్క మాటలో చెప్పాలంటే స్వాతంత్ర్య కాలంనాటి సామాజిక రుగ్మతలు నేడు అంతగా లేనప్పటికీ- కులపరమైన సాంఘిక దురాచారాలు నేటికీ సాగుతూనే ఉన్నాయి. కుల నిర్మూలనా పోరాటాల ఆవశ్యకతను గుర్తించిన నేటి సామాజిక విప్లవ కాలంలో జాషువాను దళితుల కవిగా నిలబెట్టినది ఈ గబ్బిలమే అనుట అవాస్తవం కాదు. గాంధేయవాదిగా అంటరానితనం పట్ల ఆగ్రహం వెళ్ళబుచ్చిన జాషువా, తన కాలంలోని ఇతర స్వాతంత్రోద్యమ కవుల కంటే మిన్నగా అంటరానితనపు అమానుషత్వాన్ని అక్షరరూపంలో అందించగలిగాడు అంటే అందుకు ప్రధాన కారణం - ఆయన స్వీయానుభవమే! శ్రీశ్రీ అన్నట్లు "అనుభవించి... పలవరించాడు" జాషువా. ఐతే తాను చెప్పదలచుకొన్న భావాన్ని తాను ఎంచుకొన్న "సాంప్రదాయ మార్గంలో" సరిగా చెప్పలేకపోయారు అనేది కూడా గమనించాల్సి ఉంది. కాళిదాసుని 'మేఘసందేశం' స్ఫూర్తితో సాగిన 'గబ్బిలం' కథనం తొలుత అంటరానివాని ఆవేదనకు అద్దం పట్టినప్పటికీ, కథాకథనం కొంతసాగే సరికి సామాజిక దృక్పథం వీడి, సాంప్రదాయ పద్ధతిలోకి చేరిపోయింది. ఆనాటికే దేశం నలుమూలలో అగ్రకుల పెత్తందార్లు హరిజన, గిరిజనులపై కొనసాగించిన అనేకానేక అమానుష అత్యాచారాలు, సామూహిక హింసలు-ఎన్నెన్నో ఉంటే ఆ అత్యాచార ప్రాంతాలకుగానీ, గ్రామాలకు గానీ జాషువా గారి 'గబ్బిలం' పోలేకపోయింది. దేశంలోని గుళ్ళూ గోపురాలు, శిధిల రాజప్రసాదాలు మీదగానే సాగిపోవలసి వచ్చింది. ఇది గమనించాల్సిన విషయం. రచనా శైలిలో పదునైన కత్తిలాంటి కలం కల్గిన జాషువా కలం నుండి సరైన దళిత దృక్పథంతో రచనలు ఇంకా కొనసాగుంటే, అవి ఎంతగా నేటి దళిత ఉద్యమాలను మరింతగా

పదును పెట్టేవో అర్థం చేసుకోవచ్చు. జాషువాగారి 'గబ్బిలం' గాంధేయ హరిజనోద్ధరణ మార్గంలోనే ఎగిరిపోయింది. కనీసం అంబేద్కర్ హరిజనోద్ధరణా మార్గం వైపుకు కూడా పోలేకపోయిందనేది కూడా విస్మరించకూడని విషయమే. అయినప్పటికీ ఆనాటి గాంధేయ జాతీయవాదులలో కూడా హరిజనోద్ధరణ పట్ల కొందరు విముఖులుగా ఉండేవారు- వారిని కూడా జాషువా వదలక ఈ విధంగా -

**అస్పృశ్యతా జాడ్య మాత్మనాశనమార్గ**
**మనుమాట కన్వయం బయ్యెగాని**
**యీశ్వర సృష్టిలో హీనుండు ఘనుడు లే**
**డను సూక్తి సమ్మత మయ్యెగాని**
**ఐకమత్యము లేమినగు పరాధీనత**
**యద్దానఁ జూచినట్లయ్యెగాని**
**మన మహాత్ముల వారి దనియింప విధిలేక**
**నటన జూపించుచున్నారుగాని**
**అన్యదేశాలు పరిహస మాడినపుడు**
**ఆత్మనుండుట పరిపాటి యయ్యెగాని**
**హరిజనుల నుద్ధరించు ప్రయత్నమందు**
**వెనుక ముందాడుచున్నవి పెద్దతలలు**

అని ఎత్తిపొడిచారు. ఏదేమైనప్పటికి తన సమకాలీనులలో మిన్నగా అందరికంటే అస్పృశ్యతను గూర్చి ఎలుగెత్తి చాటిన కవికోకిల గుర్రం జాషువా అనుట నూటికి నూరుపాళ్ళు నిజం.

**సామాజిక సమస్యలు:**

అస్పృశ్యతతో పాటు జాషువా కలం సారించిన సామాజిక రుగ్మతల్లో స్త్రీల సమస్య ప్రధానమైనది. స్త్రీలను సామాజికంగా తక్కువ వారిగా జూసే విధానాన్ని దుయ్యబట్టాడు. పురుషుని అహంకారాన్ని "పురుషాకారత నున్న జాలతనిలో పుంస్త్వంబు లేకుండినన్" అంటూ ఈసడించుకొన్నాడు.

**"కొట్టుటకు తిట్టుటకు నొక**
**పట్టా జన్మించినట్లు భావించె"** స్త్రీలను వెతల పాల్జేస్తే స్త్రీలు అది తమ 'విధి యనుకొను' చున్నారని ఆవేదన చెందారు.

**పురుషులు వంటయింటి కొరముట్టుగ నిన్ను గణించుచుండ, కి**
**క్కురు మనకుండ సంసరణ కూటమునంబడు మందభాగ్యవై**
**...... ఇంటి తలవాకిలి దాటని పుట్టుఖైదువై**

అంటూ స్త్రీల స్థితిగతుల్ని చెప్పుతూ, మారుతున్న కాలంలో మారుతున్న స్త్రీల చైతన్యాన్ని గుర్తించి "నేటి నెలత" అనే ఖండికలో

**గ్రహియించినది నేటి కామినీ తిలకంబు**
**బురఖాల కెరయైన బుద్ధిబలము** అంటూ స్త్రీల చైతన్యాన్ని దీప్తిమంతం చేస్తూ తన రచనా విధానం సాగించాడు- "పిల్లల కోసం మగవారు మరో వివాహం చేసుకొంటారు, అది తప్పుగాదు-మరి

**ధర్మాలెటుల్, చెల్లన్ నేరవౌ నీవు కొండక**
**పతిన్ జేపట్టి పెండ్లాడినన్** – అని నిలదీసి ప్రశ్నిస్తాడు జాషువా.

**అబలయన్న బిరుదు మంటించి కాంతల**
**స్వీయ శక్తులదిమి చిదిమినారు**
**సబలయన్న బిరుదు సాధించి హక్కులు**
**గడన చేసికొమ్ము కష్టచరిత**

అంటూ స్త్రీ శక్తిని తెలియజేస్తూ చక్కటి సందేశమిచ్చాడు.

ఇంకా.... కాశ్మీర్ సమస్యపై–

**నెత్తుటి ముద్దై, కఱకు**
**గత్తులు చేపట్టియున్న కాశ్మీరములో......**
**మిత్తువ నటించె మతమును**
**సత్తికి నరబలియ మేటి సారంబు గదా!**

అని మతాల విద్వేషాల్ని ఎత్తి చూపారు.

**కుల మతాలు లేని బలమైన జాతిగా**
**మార్చ దలచినాము మానవులను**
**కుల మతంబు లెన్నికల కాలములలోన**
**అడప దడప మాకు నవసరములు**

–అంటూ పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఎన్నికల విధానంలోని లోపాన్ని తూర్పారబట్టారు.

మార్క్స్ సిద్ధాంతానికి ఎంత చేరువ కాకున్నా, గాంధేయ సిద్ధాంతాన్ని ఎంతగా అంటిపెట్టుకొని ఉన్నా జాషువాలోని దళితత్వం ఓమారు సామ్యవాదం వైపుకు రాక తప్పిందికాదు. అందుకే "కాందిశీకుడు" అనే ఖండ కావ్యంలో

**కొడవటి టెక్కమున్ దలను గూరిచి కార్మిక కర్షకాళిలో**
**నడుము బిగించె నీ యుగము నందొక నూతన సామ్యవాద మ**
**న్గడిబిడి, దాని దెబ్బకు కకావికలైనది స్వార్థ జర్మనీ**
**జడనిధి, నేటి మారుపు లసంఖ్యము లంచితముల్ విచిత్రముల్**

అని మార్క్స్ సిద్ధాంతాన్ని చెప్పక తప్పింది కాదు జాషువాకు.

ఇప్పటికి చూచిన ఈ విషయమంతా జాషువా ఖండ కావ్యాలలోనివే. "మరణం లేని మానవత్వాన్ని కామించి కవితా వీణపై నేను మ్రోయించిన వ్యధా తంత్రులే ఖండ కావ్యాలు" అని ఆయనే ఖండ కావ్య ప్రాశస్త్యాన్ని చెప్పుకొన్నారు.

దళిత కులంలో పుట్టి "ధరణీశులు" మెచ్చుకొనే విధంగా పద్య రీతుల్లో తన కవితా మధుర మంజుల సాహిత్యాన్ని సృష్టించిన స్రష్ట గుఱ్ఱం జాషువా.

స్వాతంత్ర్యం కాలంలో జాతీయవాదిగా నిలచిన జాషువా స్వాతంత్ర్యానంతరం ఈ నల్ల ప్రభువులు ప్రజలకు ఒరగబెట్టింది శూన్యమని అతి తక్కువ కాలంలోనే గ్రహించాడు. స్వరాజ్యం–

ఉత్తస్వాహా రాజ్యమని గుర్తించాడు. "పర రాజ్యం పోయి, ప్రజారాజ్యమై బామికున్నది లేదు. కొందరికి ప్రజారాజ్యంగా, కొందరికి మజారాజ్యంగా, కొందరికి క్షుధా రాజ్యంగా తయారై అష్టకష్టాల కాలవాలమైంది. మేడలు పెరిగి మేధస్సు తరిగింది...." అని వాపోయారు.

**చాటించితివి ప్రజాసామ్రాజ్య ధేనువు**
**నిండారు శుభములు పించుననుచు**
**నిందించి అవి సీమనృపుల రాచటికంబు**
**నట్టింటిలో చిచ్చు బెట్టుననుచు**
**యుగ్గడించితి రాట్న మొక్కటే దేశ దా**
**రిద్ర్యంబు నదమి నిర్జించుననుచు**
**వా కొంటి వల్ల స్వేచ్ఛా కేతనము నీడ**
**బంగారు పంటల బండుననుచు**

**రాజ్యపీఠమెక్కి, రాజదండము బట్టి**
**మూడువత్సరాలు ముగిసిపోయె**
**దొరల రాచరికమే మెరుగయ్యె ననిపించి**
**మారుపల్క వేల మంతి రన్న!**

అని 'ప్రశ్న' అనే ఖండికలో ప్రశ్నించారు.

ఒక జాతీయవాదిగా, ఒక సామాజిక రచయితగా, ఒక దళిత మేధావిగా జాషువా చిరస్మరణీయుడు. ప్రతిభ అగ్రవర్ణాల సొత్తు అని విర్రవీగే వారికి ఒకే ఒక్క జవాబు "జాషువా".

---

# నీచ రాజకీయాలు

అధికారంలో కొనసాగుతున్న ప్రభుత్వాలు పరిపాలన చేయకుండా ఛీప్ టాక్టీస్‌లతో డైవర్షన్ రాజకీయాలు నడపడానికి బెస్ట్ ఎగ్జాంపుల్ లడ్డు రాజకీయం. కల్తీ లేదా అవినీతి జరిగినప్పుడు సంబంధిత వ్యక్తులను వెంటనే అరెస్టు చేయడం, కేసు పెట్టడం జరగాలి. రెండు నెలల నుండి అరెస్టు చేయకుండా కేసు పెట్టకుండా మత రాజకీయ దుమారాన్ని కొనసాగించడం నీచమైనది. ఈ నీచ రాజకీయాలకు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాకు తోడు హిందూ మత సంస్థలువంత పాడుతూ గాలిలో యుద్ధం చేయడం ఎందుకు? కోర్టు విచారణలు, కమిషన్లు ఎందుకు? నెయ్యి కల్తీ చేసి తిరుపతి దేవాలయానికి అమ్మిన వారిని, దానిని కొనుగోలు చేసిన వారిని, కల్తీ జరగకుండా అవినీతి జరగకుండా అనేక దొంతరలలో ఉన్నవారిని అరెస్టు చేయడం మొదలు చేయవచ్చు కదా? అరెస్టు చేస్తే అందులో ముస్లింలు ఉన్నారా, క్రైస్తవులు ఉన్నారా, దళితులు ఉన్నారా, హిందువులు ఉన్నారా, బ్రాహ్మణులు అగ్రకులాలు ఉన్నారా తేలిపోతుంది కదా? ఈ విషయాలు ఏమీ చేయకుండా దేవస్థానం అపవిత్రమైందని దేశమంతా అపవిత్రమైందని శుద్ధి కార్యక్రమమని దేవస్థాన కమిటీలలో ఇతర మతస్తులు ఉన్నారని లేదా అపవిత్రులు ఉన్నారని ప్రచారాన్ని లంకించుకోవడం ద్వారా గాలిలో యుద్ధమే తప్ప నిజమైన యుద్ధం కాదు. తప్పు చేసిన వారిని అరెస్టు చేయకుండా సమాజంలో ఏ సమస్యలు లేనట్టుగా ఆంధ్ర తెలంగాణ మీడియా 24 గంటల వార్తల విశ్లేషణలో లడ్డు రాజకీయమే ఆక్రమించడం అంటే నీచమైన రాజకీయం కాకపోతే మరేమిటి? **– జంపన్న**

# ఆహారం - ఆరోగ్యం

## LOW CARBOHYDRATE HIGH FAT (LCHF) DIET

## పుట్టు పూర్వోత్తరాలు

*(గత సంచిక తరువాయి)*

**డా॥ కె. శంకర్,** M.D., DTCD,

**డా॥ జాసన్ ఫంగ్ గురించి....**

LCHF Diet విధానాన్ని తన రోగుల్లో అమలు పరుస్తూ, అద్భుతమైన ఫలితాల నివేదికలను అందిస్తూ ఉన్న డా॥ జాసన్ ఫంగ్ కెనడాకు చెందిన ఒక నెఫ్రాలజిస్ట్ (కిడ్నీ వ్యాధి నిపుణులు). తన రోగుల్లో 70 శాతం రోగులు మధుమేహులే. వారు సక్రమంగా ఇన్సులిన్ మరియు ఇతర మందులు వాడినప్పటికీ వారి కిడ్నీలు దెబ్బతినకుండా తను రక్షించలేకపోవడంతో తీవ్రంగా ఆవేదన చెందారు. మందులకు ప్రత్యామ్నాయంగా LCHF Diet ద్వారా సురక్షితంగా, నాణ్యమైన జీవితాన్ని గడపగలరని తన రోగుల్లో నిరూపించగలిగాడు. ఆయన LCHF Diet విధానంతో పాటు ఉపవాసాల్ని (Fastings) జోడించి అద్భుతమైన ఫలితాలను అందిస్తున్నారు. ఉపవాసాల్లో మన శరీరంలోని కొవ్వులు కరిగి 'కీటోన్ 'ల రూపంలో మెదడు మరియు ఇతర అవయవాలకు శక్తిని అందజేస్తాయి. జాసన్ ఫంగ్ అద్భుతమైన ప్రసంగాలు కూడా మనం యూట్యూబ్‌లో వినవచ్చు. ఆయన వ్రాసిన ప్రఖ్యాత పుస్తకాలు 1. The Obesity Code, 2. The Diabetic Code 3. The complete guide to Fasting, 4. The Cancer Code. ఆయన గ్యారిటాబ్స్ వ్రాసిన ప్రామాణిక పుస్తకం "Good Calories - Bad Calories" మీద ఆధారపడే ఈ పుస్తకాలన్నీ వ్రాశాడు. అలాగే ఆయన వైద్యానికి కూడా ఈ పుస్తకమే ఆధారం.

**ఎవరికి ఈ డైట్ విధానం అవసరం ?**

1. ఊబపొట్ట (Abdominal obesity) ఉన్నవారు, మొదటగా ఎత్తు కొలవాలి. 66 అంగుళాలు ఎత్తు ఉన్నారనుకుంటే, అందులో సగం అంటే 33 అంగుళాలు మాత్రమే బొడ్డు చుట్టు కొలత ఉండాలి. అంతకు మించకూడదు. దీన్నే 'స్ట్రింగ్ / రోప్ టెస్ట్' అని అంటారు. 2. అధిక బిపి 3. టైప్ −2 మధుమేహం 4. అధిక ట్రైగ్లిజరైడ్స్ 5. స్త్రీలలో ఋతు చక్రం (నెలసరి) సరిగ్గా లేకపోవడం లేదా PCOS తో బాధపడడం 6. మగవారిలో అంగస్థంబన సరిగా లేకపోవడం 7. మెడమీద, చంకలలో మరియు ఇతర ప్రాంతాలలో ముదురు రంగు మచ్చలు ఉండడం 8. కుటుంబంలో ఎవరికైన మధుమేహం, గుండె జబ్బులు ఉండడం 9. త్రాగిన నీరు మూత్రం ద్వారా పోకుండా శరీరంలో నిల్వ ఉండడం. పై అంశాల్లో ఒక్కటి పాజిటివ్‌గా ఉన్నా మీరు సమస్యలో ఉన్నట్లు. రెండు అంశాలు మీకు పాజిటివ్‌గా ఉన్నట్లైతే మీకు ఇన్సులిన్ నిరోధకత ఉన్నట్లే! క్యాన్సర్ మరియు వివిధ మానసిక సమస్యలు కూడా ఈ డైట్‌తో నియంత్రణలో ఉంచవచ్చని నూతన పరిశోధనా ఫలితాలు వెల్లడి చేస్తున్నాయి.

ఈ డైట్ విధానం మొదలు పెట్టాలనుకుంటే, మీరు LCHF డైట్ స్పెషలిస్ట్ వైద్యులను సంప్రదించాలి. ఈ డైట్ విధానం మొదలు పెట్టే ముందు కొన్ని పరీక్షలు చేసుకోవడం తప్పనిసరి. షుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఇన్సులిన్, కీటోన్ బాడీస్ మొ॥ రక్త పరీక్షలు మరియు కొన్ని ఇతర పరీక్షలు ప్రతి మూడు నెలలకొకసారి తప్పక చేయించుకోవాలి. ఈ డైట్ విధానంలో ఏదైనా సమస్య వచ్చినపుడు వారి వైద్యున్ని సంప్రదించాలి.

## వైద్యుల కర్తవ్యమేమిటి?

వైద్యులందరూ ఈ LCHF డైట్ విధానాన్ని శాస్త్రీయ అవగాహనతో పరిశీలించాలి. అందుకు ఈ డైట్ విధానానికి ప్రామాణికం అయిన గ్యారిటాబ్స్ వ్రాసిన "Good Calories - Bad Calories" పుస్తకాన్ని తప్పనిసరిగా చదవాలి. ఈ పుస్తకం తెలుగులో కూడా లభ్యమవుతుంది. అలాగే జాసన్ ఫంగ్ గారి పుస్తకాలు కూడా చదవాలి. అధిక పిండి పదార్థాల వినియోగం వెనక ఉన్న శక్తులను గమనించాలి. ప్రస్తుత ఆహార మరియు మందుల పరిశ్రమల, కార్పోరేట్ వైద్య రంగాల లాభాపేక్షలను గుర్తించాలి.

ఈ డైట్ విధానాన్ని మరింతగా అభివృద్ధి పరచేందుకు, లాభనష్టాలను అంచనా వేసేందుకు కృషి చెయ్యాలి. పరిశోధనలు చేపట్టాలి. వైద్యులు ఈ డైట్ విధానంపై అవగాహన పెంచుకున్న తర్వాత రోగులను, ప్రజలను చైతన్యపరచాలి. నేడు ఆహారంతో పాటు మనం పీల్చుకొనే గాలి, త్రాగేనీరు కూడా కలుషిత మయ్యాయి. నేటి మన ఆహార శైలి మరియు కాలుష్యాలు రెండూ కలసి మనకు జీవనశైలి వ్యాధులను మరియు క్యాన్సర్‌ను కలుగచేస్తున్నాయి. ఈ కాలుష్యాలను నియంత్రించేందుకు, నివారించేందుకు వైద్యులు తమ సూచనలను, సలహాలను సంబంధిత అధికారులకు, ప్రభుత్వాలకు మరియు ప్రజలకు వివిధ రూపాల్లో తెలియచెయ్యాలి. ఆరోగ్యంలో ఆహార పాత్రను ప్రజలకు వివరించాలి. అప్పుడే మనం 'ప్రజారోగ్య' వైద్యులం అవుతాము.

**గమనిక :** ఈ డైటు విధానాన్ని పాటించాలనుకునే వారు నా మొబైల్ నెం. 9440673953కి వాట్సాప్ మేసెజ్ పెట్టగలరు. నేను మీకు డైట్ షెడ్యూల్ అందించటంతోపాటు ఈ డైట్‌కు సంబంధించిన ఆరోగ్య అంశాలలో తోడ్పాటు అందించగలను.

---

**ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణ దిశగా ది.15-08-2024 గురువారం ఉదయం 10 గంటలకు నాస్తికసమాజం తెనాలి రెవెన్యూ డివిజన్ కార్యదర్శి ఆర్. శివకృష్ణ నూతన గృహప్రవేశం జరిగింది.**




"అన్ని రంగాలల్లో ప్రత్యామ్నాయాల్ని రూపొందించకుండా వ్యవస్థను మార్చడం కల్ల!" అన్న సూక్తితో చైతన్యం పొందిన శివకృష్ణ తన నూతన గృహప్రవేశం సందర్భంగా తెనాలి పట్టణంలోని అన్ని ప్రజాసంఘాల బాధ్యులను ఆహ్వానించి వారి సంఘాలను అందరికి పరిచయం చేసి సమాజ మార్పు కోసం వారు చేస్తున్న కృషిని అందరికి తెలియజేశారు.

# గాంధీ - భగత్‌సింగ్

- దివికుమార్

**(ఈ వ్యాసము "నా నెత్తురు వృథా కాదు" పుస్తకం నుండి గ్రహించడమైనది)**

(గత సంచిక తరువాయి)

## ఫ్యూడల్ భావాల గాంధీ - విప్లవ తేజస్వి భగత్‌సింగ్

గాంధీ ఫ్యూడల్‌వ్యవస్థ పరిరక్షణకు మానసిక పరివర్తనను బోధించినట్టు, అహింసను జపించినట్టు సాంస్కృతికంగా కూడా ఫ్యూడల్ భావాలను నిలబెట్టడానికి తీవ్రంగా కృషి చేశాడు. ఆయన హిందూ మతాభిమానము, వర్ణాశ్రమధర్మాల మీద నమ్మకము దీనినే రుజువు చేస్తాయి. అయితే బూర్జువా సంస్కృతి ప్రభావంతో ఫ్యూడల్ విశ్వాసాలు సడలి నూతన ధోరణులు తలెత్తి పాతభావాలను తుడిచిపెట్టే పరిస్థితులు ఏర్పడ్డ కారణంగా, ఫ్యూడల్భావాలను కూడా సంస్కరించి ఆ విషగుళికలకు పంచదార పూత పూసి మింగించాలని గాంధీ ప్రయత్నం.

దీనికి భిన్నంగా భగత్‌సింగ్ గతితార్కిక చారిత్రక భౌతికవాద దృక్పథంతో సమాజాన్ని ప్రకృతిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు. 'నాస్తికత్వం ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే తప్ప అహంకారాన్ని కలిగించేది కాదు" అన్నాడు.

గాంధీకి హిందూ మతాభిమానము, విగ్రహారాధన, వర్ణాశ్రమ ధర్మాలు, రామరాజ్య పరిపాలనావిధానం మొదలయిన పచ్చి ఫ్యూడల్‌భావాలపట్ల అభిమానం జాస్తి. ఈయన రామరాజ్యస్థాపన భావంతో మహమ్మదీయులుగానీ, క్రైస్తవులుగానీ ఎందుకు ఏకీభవిస్తారు? ఆ విధంగా ఈయన లక్ష్యాలపట్ల విశ్వాసాలపట్ల వారికి అనుమానాలుండటానికి సహజంగా ఆస్కారం కలుగుతుంది.

గాంధీయే స్వయంగా ఇతర మతస్తులని కూడా తమ మత విశ్వాసాలను నియమబద్ధతతో పాటించమని కోరారు. ఇది మత భావాలను మత వాతావరణాన్ని పెంచుతుందే తప్ప తుంచదు. మత ఘర్షణలు చెలరేగటానికి ఈ వాతావరణం తోడ్పడింది. ఆచరణలో హిందూ ముస్లిమ్ ఐక్యత సాధ్యం కాలేదు ఏ మతాభిమానమూ లేనివారు మతాన్ని రాజకీయాలతో మిళితం కానివ్వనివారు మాత్రమే వివిధ మతస్తుల మధ్య ఐక్యతను సులువుగా నెలకొల్పగలరు తప్ప గాంధీలాంటి మతాభిమానిని అన్యమతస్తులు తమ వానిగా స్వీకరించటానికి సిద్ధపడలేరు.

గాంధీ ఒక ఇంటర్వ్యూలో ఎలా చెప్పాడో చూడండి. "నేను వర్ణధర్మాన్ని విశ్వసిస్తాను. వర్ణధర్మం జీవితధర్మం. కొందరు ప్రబోధించడానికి, మరికొందరు వ్యాపారం, వ్యవసాయం చేయడానికి, ఇంకా కొందరు కాయకష్టం చేయడానికి ఉద్భవించారని నా విశ్వాసం. తద్వారా ఆ వృత్తులు వంశపారంపర్యంగా సంక్రమిస్తూ వుంటాయని కూడా విశ్వసిస్తాను. నేను పాకీపని చేస్తే నా కుమారుడు పాకీ పనివాడుగా ఎందుకు చేరకూడదు?"

*(వర్ణాశ్రమ ధర్మాలు - శతజయంతి ప్రచురణ-పేజీ 86)*

గాంధీ పూర్వీకులు లాయర్ వృత్తిని ఎప్పుడు చేశారో, రాజకీయాల్లో ఎప్పుడు తిరిగారో మనకు తెలియదు. ఏది ఏమయినా పేదవాడు, కూలివాడు వారి సంతానం తరాల తరబడి అలాగే

మగ్గిపోతుంటే కొద్దిమంది విలాస జీవితాల్ని వారసత్వంగా పొందటానికి తప్ప ఈ ధర్మసూత్రాలు మరెందుకూ పనికిరావు. ఇది కుళ్ళి కంపుకొడుతున్న ఫ్యూడల్ సంస్కృతిని నిలబెట్టడానికి ఆధునిక పద్ధతులలో చేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. అందుకే అంటున్నాడు. "తరతరాల నుండి మీకు సంక్రమిస్తున్న సంస్కృతిని బ్రాహ్మణుల పట్ల మీకు కలిగిన ఆగ్రహం వల్ల తొందరపాటుతో గుడ్డితనంగా కాలికింద తొక్కి నలిపేయడానికి ప్రయత్నిస్తున్నారు. (పై పుస్తకం– పేజీ 89)

ఈ రకమైన సిద్ధాంతాలకు సమాధానంగా భగత్‌సింగ్ నేనెలా నాస్తికుడనయ్యాను అన్న వ్యాసంలో ఇలా రాశాడు. "అహంభావం ఆధిక్యభావం కలిగిన బ్రాహ్మణవర్గం సంఘంలోని కొందరిని అజ్ఞానంలోనూ, అమాయకత్వంలోనూ వుంచుతున్నారు. ఈ విధంగా అజ్ఞానంలో వుంచబడటం కూడా వారికి పూర్వజన్మ పాప ఫలితంగా వచ్చిన శిక్షేనా?...ప్రియమిత్రులారా! ఈ సిద్ధాంతాలన్నీ సమాజంలో కడుపు నిండినవారు, అన్ని హంగులూ అధికారాలు కలిగినవారు సృష్టించినవే తప్ప మరొకటికాదు. తాము చేజిక్కించుకొన్న అధికారాన్ని, సకల సంపదలను, అధికృతలను కాపాడుకొనేందుకే ఈ సిద్ధాంతాలనన్నిటిని వారు కనిపెట్టారు. వాటి సాయంతోనే తమ స్థానాన్ని నిలబెట్టుకొంటున్నారు."

గాంధీ వర్ణాశ్రమ ధర్మాలను పాటించమని హిందువులకు బోధించటమే కాక ముస్లిములకు క్రైస్తవులకు 'మతమార్పిడిని ప్రోత్సహించవద్దు' అని పదేపదే విజ్ఞప్తి చేసేవాడు. ఇది కూడా ఆయన హిందూ మతాభిమానాన్ని సూచించేదే. ఎందుకంటే ఇతర మతాల నుండి హిందూమతంలోకి ఎవరూ మారరు. కారణమేమంటే హిందూమతంలోని ప్రతివ్యక్తీ గుర్తింపు పొందేది కులం ద్వారానే. వాటికి ఉచ్చనీచాలున్నాయి. ఎక్కువ తక్కువలున్నాయి. కనుక గుర్తింపు సమస్య వస్తుంది. అందుచేత సాధారణంగా ఈ రకం మార్పు జరగదు. కానీ హిందూ మతంలో నుండి ఇతర మతాల్లోకి మార్పిడి సులభమే. హిందువులకు కులం తప్ప కోల్పోయేదేం లేదు కూడా. హిందూమతంలో నుండి ఇతర మతాల్లోకి మార్పు చెందనీయకుండా చేయడానికే "నీవు నీ మతం విడిచి, నా మతంలోకి రమ్మని మత మార్పిడి ఉద్యమాలు లేవనెత్తటం అసహనం, అమానుషం కూడా అవుతుంది." అంటున్నాడు. (నా మతము–గాంధీ శతజయంతి ప్రచురణ–పేజీ 52)

భగత్‌సింగ్ మతవిశ్వాసాలను విడిచిపుచ్చటమేకాక సిక్కులకు చాలా కష్టసాధ్యమైన కట్టుబాటునే త్యజించాడు. గడ్డాన్ని, సిగను తీసేసి మామూలుగా రూపొందాడు. "దోపిడిదారులు, పీడకులు మతాన్ని ఉపయోగించుకొన్నారన్న విషయాన్ని నేను కాదనను. రాజుమీద తిరుగుబాటు చేయటం పాపమని అన్ని మతాలు చెబుతాయి" అని మతాన్ని నిర్ద్వంద్వంగా భగత్‌సింగ్ ఖండించాడు.

భగవంతుని గూర్చి చెబుతూ గాంధీ "అతడు అనంతమైనవాడు. అనాది నుంచీ ఉన్నవాడు. సదా ఒకే రకంగా ఉండేవాడు. ఈ మహావిశ్వానికి ఆత్మ అనదగ్గవాడు. కారణం అనదగ్గవాడు. అతడు చైతన్య స్వరూపుడు, జ్ఞాన స్వరూపుడు. అతనొక్కడే శాశ్వతమైనవాడు. మిగిలినవన్నీ అశాశ్వతమైనవి."

ఇటువంటి గుడ్డి ఆరాధకులకు భగత్‌సింగు 'నేనెలా నాస్తికుడనయ్యాను'లో అనేక ప్రశ్నలు వేశాడు. ఒక్కటి ఉదహరిస్తే సరిపోతుంది.

"ఒక మనిషి ఏదైనా పాపకార్యం చేస్తున్నప్పుడు ఆ పాపకార్యం చేయకుండా దేవుడు– సర్వశక్తిమంతుడైన భగవంతుడు ఎందుకు ఆపు చేయకూడదు? యుద్ధ బీభత్సాలను, మానవ

మారణహోమాన్ని సాగించే రాజులను, ప్రభువులను ఎందుకు హతమార్చడు? ఇలాంటి దుర్మార్గులను ముందుగానే ఎందుకు శిక్షించకూడదు? మానవజాతిని మారణహోమం చేసే భయంకరమైన ప్రపంచయుద్ధాన్ని రాకుండా దేవుడు ఆపు చేయలేడా?"

పైన చర్చించిన అంశాలన్నీ స్పష్టం చేసేదేమంటే భగత్‌సింగు, గాంధీలు పరస్పర విరుద్ధమయిన రాజకీయ, సామాజిక, తాత్త్విక చింతన కలవారనీ, వీరిరువురి మార్గాలే కాక లక్ష్యాలు కూడా పరస్పర విరుద్ధమయినవనీ!

గాంధీ భూస్వామ్య బడా బూర్జువా వర్గాల ప్రతినిధిగా సామ్రాజ్యవాదుల దోపిడీ సాధ్యమయినంత ఎక్కువకాలం కొనసాగే పద్ధతులనే అనుసరించాడు. అధికార మార్పిడి నాటి షరతులు, ఈ నాటికీ పెరిగిపోతున్న విదేశీ అప్పులు, సామ్రాజ్యవాదుల దోపిడీ దీనికి తిరుగులేని ఆధారాలు. గాంధీ శిష్యుడు బిర్లా రు. 30 కోట్ల ఆస్తిని రు. 1200 కోట్లకు పెంచుకోడానికి ఈ స్వాతంత్ర్యం తోడ్పడింది.

భగత్‌సింగ్ తక్షణలక్ష్యం సామ్రాజ్యవాదుల్ని తరిమివేయటమే కానీ దీర్ఘకాలిక లక్ష్యం దోపిడీ వ్యవస్థనే రద్దు చేసి కార్మిక–కర్షక రాజ్యాన్ని స్థాపించటం, పాలకవర్గాలకి ఈ విషయం స్పష్టంగా తెలుసు. అందుకే ఆనాటి గాంధీ, నెహ్రూలు భగత్‌సింగ్ ఉరిశిక్షను తప్పించటానికి ప్రయత్నించలేదు. ఈనాటి పాలకులు భగత్‌సింగు గురించి యువకులకు విద్యార్థులకు తెలియనివ్వకుండా జాగ్రత్తపడుతున్నారు. పాలకవర్గాల ఈ కుట్రను విప్లవయువకులు భగ్నంచేయాలి.

**వారసులెవరు?**

చివరగా భగత్‌సింగ్‌కి వారసులెవరు? అన్న అంశంతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

ఈనాటి అర్ధవలస – అర్ధఫ్యూడల్ వ్యవస్థ పరిరక్షకులైన కాంగ్రెసు, తెలుగుదేశం లాంటి పార్టీవారి నుండి గాంధీయన్ సోషలిజాన్ని (ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని) మతోన్మాదంతో సాధించాలని చూసే ఆర్.ఎస్.ఎస్. వాదుల వరకూ భగత్‌సింగుకి జోహార్లు చెబుతున్నారు. తామే నిజమైన వారసులమని ప్రకటించుకోవడానికి పోటీపడుతున్నారు. ఇదంతా భగత్‌సింగ్ యొక్క దేశభక్తికీ త్యాగనిరతికీ ప్రజలు చూపే అభిమానాన్ని మోసపూరితంగా సొమ్ముచేసుకొనే దగుల్బాజీతనం తప్ప మరొకటికాదు.

కాంగ్రెసు పార్టీవి–గాంధీవి–సామ్రాజ్యవాదులకు లొంగివుండే దళారీ విధానాలు తప్ప మరొకటికాదు అని భగత్‌సింగ్ తెగేసి చెప్పాడు. బ్రిటీషు సామ్రాజ్యవాదుల ఆర్థిక దోపిడీతోపాటు, పరిపాలన, న్యాయ, విద్యావ్యవస్థలన్నింటినీ పరిరక్షించే షరతులమీద అధికారాన్ని భిక్షగా పొందిన మార్పిడిని–జాతీయ స్వాతంత్ర్యంగా ప్రకటించే కుహనా వామపక్ష పార్టీలు కూడా మనదేశంలో వున్నాయి. ప్రజావిప్లవం ద్వారా తప్ప మౌలిక మార్పు రాదని, అందుకు సాయుధ పోరాటం, సాయుధ సైన్య నిర్మాణం తప్పనిసరి అని భగత్‌సింగు బోధిస్తే; అసెంబ్లీలు, పార్లమెంటులో వోట్లకి, సీట్లకీ కక్కుర్తిపడి పాలక పార్టీలతో ఎన్నికల పొత్తుల జిత్తులతో మునిగిపోయినవారు భగత్‌సింగు వారసులెలా కాగల్గుతారు? పార్లమెంటరీ పద్ధతులకు అలవాటుపడిపోయి దోపిడీ రాజ్యాంగ యంత్రంతోనే పరిపాలన చెయ్యటానికి సిద్ధపడుతున్న వీరు కాట్స్కీ, జయచంద్ర విద్యాలంకర్‌ల వారసులు కాగల్గుతారేకానీ లెనిన్, భగత్‌సింగుల వారసులు మాత్రం కాలేరు.

భగత్‌సింగు టెర్రరిస్టుగా చాలా కొద్దికాలమే వున్నాడు. ఆయనకు మార్క్సిస్టు పరిజ్ఞానం అందుబాటులోలేని రోజుల్లో మాత్రమే అలా అయ్యాడు. తగినంత విలువైన భారత విప్లవ అనుభవాలు అప్పటికి గ్రంథస్తం కాకపోవటంవల్ల కూడా అలా అయివుండవచ్చు. కానీ ప్రపంచ విప్లవానుభవాలే కాక–భారత విప్లవానుభావాలు కూడా అందుబాటులో వున్న ఈనాడు టెర్రరిస్టు పద్ధతుల్ని అనుసరించడం అత్మహత్యా సదృశ్యమే. టెర్రరిజం ప్రజల్ని తమకాళ్ళమీద నిలబడనీయదు. పార్లమెంటు, అసెంబ్లీలలో కూర్చున్న నాయకులు తమ జీవితాల్ని మార్చి వేస్తారని ఆశతో ప్రజలు కర్తవ్యశూన్యులై ఉండిపోయినట్టుగానే టెర్రరిస్టు వీరులొచ్చి తమ శత్రువులను సంహరించి తమకు విముక్తిని ప్రసాదిస్తారని ప్రజల్ని అర్రులుచాచి నిలబడిపోయేట్టు చేస్తుంది. నేటి దోపిడీవ్యవస్థలో నలిగిపోతున్న పీడిత ప్రజానీకం తమ తమ సంఘటితశక్తితో, మిలిటెంట్ పోరాటాలు నిర్వహించి అంతిమంగా సాయుధపోరాటాల్లో పాలక సైన్యాన్ని తుదముట్టించి అధికారంలోకి వచ్చేవైపుగా కృషి సాగించేవారే భగత్‌సింగుకి వారసులు కాగల్గుతారు తప్ప... మేము వారసులమంటే మేము వారసులమనుకునే వారందరూ కాలేరు.

---

## సైన్సే ప్రొద్దు! – మా.శ్రీ.రాజు

కులం కులం అంటావు
కులం ఎందుకు?
కూడు పెడుతుందా?
గూడు కడుతుందా?
కులం కులం అంటావు
కులం ఎందుకు?
కుర్చీ వేస్తుందా?
కూర్చో పెడుతుందా?
మతం మతం అంటావు
మతం ఎందుకు?
మంచినీళ్ళు ఇస్తుందా?
మంచిగ చూస్తుందా?
మతం మతం అంటావు
మతం ఎందుకు?
మంచం వేస్తుందా?
మంచి చేస్తుందా?
కులాలు వుంటే –
కుమ్ములాటలే!
మతాలు వుంటే –
మంటలు రేగటమే!
కులాలు వుంటే –
కుట్రలు జరగటమే!
మతాలు వుంటే –
మంటల్లో మాడటమే!
కులాలు వుంటే –
కూలిపోవటమే!
మతాలు వుంటే
మసై పోవుటమే!
కులాలు వద్దు!
మంచి గుణాలు ముద్దు!!
మతాలు వద్దు!
మంచితనం ముద్దు!!
కులాలు పోవాలంటే –
మంచి గుణాలు కలగాలంటే,
మతాలు పోవాలంటే
మంచితనం వెలగాలంటే,
హేతువాదమే హద్దు!
నాస్తికత్వమే ముద్దు!
సైన్స్ త్రోవే ప్రొద్దు!!

# భారత చరిత్రలో అతిపెద్ద నాస్తిక ఉద్యమం

(2022 మార్చి 12, 13 తేదీలలో నిర్వహించిన 30వ జాతీయ నాస్తికమేళాలో ప్రముఖ బౌద్ధ రచయిత **డి.చంద్రశేఖర్** ప్రసంగం)

*(గత సంచిక తరువాయి)*

**శ్రమణులు – వైదికులు**

(1) క్రీ.పూ. 18వ శతాబ్దిలో భారత ఉపఖండంలోకి ప్రవేశించిన సంచార తెగలకు చెందిన ఆర్యులు వైదిక సంప్రదాయానికి మూలపురుషులు. ఆర్యుల తొలి గురువులైన ఋషులు రూపొందించినవని చెప్పబడే వేదాలు జ్ఞానానికి, సత్యానికి ప్రమాణమని ఈ సంప్రదాయం చెబుతుంది; వీటి తదనంతరం పెంపొందిన జ్ఞానం అంతటికి వేదాలే ఆధారమని ప్రకటిస్తుంది. కనుక దీనికి వైదిక సంప్రదాయం అనే పేరు వాడుకలోకి వచ్చింది. దీనికి సనాతన ధర్మం, ఆర్యధర్మం అనే పేర్లు కూడ ఉన్నాయి. మొదటి దశలో ఇది ఆర్యుల కోసం, ఆర్యులు రూపొందించుకున్న, ఆర్యులకే పరిమితమైన ధర్మంగా కొనసాగింది. కాలక్రమంలో ఆర్య, ద్రవిడ జాతుల సంపర్కం ఫలితంగా, ఆర్యేతరులు గణనీయ సంఖ్యలో దీన్ని అనుసరించారు.

ఆర్యుల రాకకు ముందు అనేక వేల సంవత్సరాల నుండి ఉపఖండంలో జీవిస్తున్న ప్రజలు శ్రమణ సంప్రదాయానికి ఆద్యులని చెప్పవచ్చు. సింధునది నాగరికత కాలంనుండి ఇది ఉనికిలో ఉన్నట్లు తగిన సూచనలు కనిపిస్తున్నాయి. తదనంతర కాలంలో, స్థిరమైన శాఖలుగా రూపొందిన (క్రీ.పూ. 6వ శతాబ్ది) నాటినుండి దీన్ని ఒక బలమైన స్రవంతిగా గుర్తించగలిగే రుజువులు పుష్కలంగా ఉన్నాయి. మానవుని అనుభవం, పరిశోధన, పరిశీలన, ప్రయోగం, సాధన, స్వయంనిర్ణయం అనేవి జ్ఞానానికి సత్యానికి మార్గాలని శ్రమణులు విశ్వసించినట్లు తెలుస్తుంది. అందువల్ల "వేదం సత్యప్రమాణం" అనే వాదాన్ని వారు పూర్తిగా తిరస్కరించారు. తాత్విక చింతనలోనే కాదు, వారివారి జీవన విధానంలో కూడ శ్రమణులకు, వైదికులకు ఎంతో భేదం ఉంది. మూలవాసులతో ప్రారంభమైన శ్రమణ సంప్రదాయంలో, తరువాత, వైదిక సంప్రదాయాన్ని నిరాకరించిన బ్రాహ్మణులు కూడ గణనీయమైన సంఖ్యలో వచ్చిచేరారు.

(2) వైదిక సంప్రదాయానికి పర్యాయపదంగా చెప్పబడే "వర్ణాశ్రమ ధర్మం" (తరువాత కాలంలో కులవాదం) నిజంగానే దానికి జీవగఱ్ఱ అని చెప్పవచ్చు. పుట్టుకతోనే సమాజంలో మనిషి స్థానం, జీవిత గమనం నిర్ణయించబడి ఉంటాయని, దీనిలో మార్పుకు ఆవకాశం లేదని ఈ ధర్మం చెబుతుంది. వర్ణధర్మంలో తమకు తాము ఆపాదించుకున్న అగ్రస్థానాన్ని నిలుపుకోవటం కోసం, తమ ప్రయోజనాలను రక్షించుకోవటం కోసం వైదిక బ్రాహ్మణులు సత్యాన్వేషణను, ధార్మిక చింతనను, నైతికతను సైతం పణంగా పెట్టి, వర్ణాశ్రమ ధర్మాన్ని కాపాడటం కోసం తమ శక్తియుక్తులన్నీ ధారపోశారు. పుట్టుక ప్రాతిపదికగా మనుషుల్ని విభజించే లేదా వర్గీకరించే ధర్మాన్ని ఏ రూపంలోనూ శ్రమణులు బోధించలేదు. వారి తాత్వికచింతన ఏదయినప్పటికీ, వారంతా వర్ణాశ్రమ ధర్మాన్ని నిర్ద్వందంగా తిరస్కరించారు. కర్మను

'నియతివాదం'గా బోధించిన శ్రమణ శాఖలు కూడ వర్ణధర్మాన్ని అంగీకరించలేదు. మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరూ జ్ఞానం పొందటానికి, పరివర్తన చెందటానికి, పరిపూర్ణ మానవునిగా వికసించటానికి అర్హులేనని, అయితే, అందుకు సరైన అవగాహన,తగిన ప్రయత్నం అవసరమని శ్రమణులు భావించారు. అంతేకాదు, వర్ణం లేదా కులం సత్యాన్వేషణలో మనిషి గమనాన్ని, గమ్యాన్ని నిర్దేశించజాలదని శ్రమణులు ఆచరణలో నిరూపించారు. శ్రమణ సంప్రదాయం బ్రాహ్మణేతర కులాలకు పరిమితమైన సంప్రదాయం అనటం కూడ సరికాదు. వర్ణవాదాన్ని నిరాకరించిన అనేకమంది బ్రాహ్మణులు శ్రమణ సంప్రదాయంలో జీవించారు. అందుకే దీన్ని నిజమైన కులాతీత సంప్రదాయంగా చెప్పవచ్చు. (3) సృష్టి-స్థితి-లయ కారకుడైన పరమాత్మ లేదా పరబ్రహ్మ తదితర మానవాతీత శక్తుల్లో విశ్వాసం కలిగివుండటం, వైదిక సంప్రదాయ చింతనకు కేంద్రబిందువు. వేదకాలపు పూజల్లో ప్రకృతిశక్తుల రూపాలైన అగ్ని, వాయువు, వరుణుడు ప్రముఖస్థానం వహించారు. ఈనాడు పూజింప బడుతున్న దేవుళ్ళు ఎవరూ వేదాల్లో కనిపించరు. ఈ పరిణామానికి అనుగుణంగానే, తొలిదశలో యజ్ఞయాగాలు, తదుపరి కాలంలో రకరకాల కర్మకాండలు, పూజలు, ప్రార్థనలు, ఉత్సవాలు ప్రముఖమైనవిగా ముందుకొచ్చాయి. ఇవే ఇహపర సుఖాలను, మోక్షాన్ని పొందే సాధనాలుగా గుర్తించబడ్డాయి.

ఇందుకు భిన్నంగా శ్రమణులు జీవిత మూలాలను, దాని గమనాన్ని, జీవిత పరమార్థాన్ని తెలుసుకోటానికి, మానవ జీవితంలోని దుఃఖం నుండి విముక్తి పొందటానికి విభిన్న మార్గాల్లో అన్వేషణ సాగించారు. పరిపూర్ణ మానవ వికాసం సాధించే దిశగా వీరు భిన్నమైన రీతుల్లో శోధన, సాధన చేశారు. అయినా, సృష్టి-స్థితి-లయ కారకుడైన మానవాతీత శక్తి అనే భావన శ్రమణ సంప్రదాయంలో మచ్చుకు కూడ కనిపించదు. అందుకే వారు యజ్ఞయాగాలను, కర్మకాండలను నిరుపయోగమైన తంతులని అన్నారు. ఎటువంటి మినహాయింపు లేకుండా, అన్ని శ్రమణ శాఖలు నిరీశ్వర (నాస్తిక) వాదాన్ని బలపరిచాయి. ఆనాటికి ఇంత విస్తృతమైన నాస్తిక ఉద్యమం ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. ఇక ఆచరణ విషయంలో నైతిక ప్రవర్తన, జ్ఞాన సాధన కోసం అన్వేషణ, కఠోర తపశ్చర్య, ధ్యానం తదితర అభ్యాసాలు శ్రమణ సంప్రదాయంలో ప్రధానపాత్ర వహించాయి.

(4) వైదిక సంప్రదాయానికి మూలగ్రంథమైన ఋగ్వేదంలో సంపద, సంతానం, ఆహారం, దీర్ఘాయుష్షు, యుద్ధంలో గెలుపు కోసం అగ్ని, ఇంద్ర, వరుణ, సూర్యాది దేవతలను ప్రార్థించటం ప్రధానాంశంగా ఉంది. దీనిలో లోకీయ అనుభవాలను ఆస్వాదించటానికి మించి ధార్మిక చింతన ఏదైనా వుంటే, అది ఈ లక్ష్యాలకు లోబడి మాత్రమే ఉంది. మత్తుపానీయాలు (కల్లు, సారాయి), మాంసభక్షణ కోసం పారవశ్యంతో చేసిన ప్రార్థనలు వేదాల్లో పుష్కలంగా ఉన్నాయి. ఈ సంప్రదాయపు తదుపరి దశలో పారలౌకిక చింతన కనిపించినా, దీనిలో ఆనాటి నుండి ఈనాటి వరకు లోకీయ లక్ష్యాలే ప్రధాన పాత్ర పోషించాయి. అందుకే, ఈ సంప్రదాయంలో ధార్మికత నీడన కొనసాగే ధనార్జన వృత్తులు – పౌరోహిత్యం, పంచాంగ వ్యాఖ్యానం, వాస్తుశాస్త్రం వంటివి విరివిగా పెంపొందాయి. వైదిక బ్రాహ్మణులు తమ బోధనలకు, సలహాలకు, కర్మకాండల

నిర్వహణకు ప్రతిఫలంగా పశువులు, వెండి, బంగారం, పంటభూములు వంటి విలువైన కానుకలు పొందేవారు. కాలక్రమంలో ఈ కానుకలను రుసుముగా వసూలు చెయ్యటం మనం ఈనాటికీ చూడవచ్చు. ఈ సంప్రదాయంలో గురుదక్షిణ విడదీయరాని అంతర్భాగం.

చవకబారు లౌకిక అనుభవాలను అదుపుచేసుకోవటం, హానికరమైన అనుభవాలను పూర్తిగా త్యజించటం ధార్మికజీవనంలో, సత్యశోధనలో అత్యవసరమని శ్రమణులు భావించారు. అందుకే వారు సత్రాల్లో, అడవుల్లో, ఊరి వెలుపల చెట్లనీడన, కొండగుహల్లో నివసిస్తూ సంచార జీవనం సాగించారు. భిక్షాటనతో కడుపు నింపుకుంటూ, ప్రతిఫలం ఆశించకుండా, శ్రమణులు తమ ధర్మాన్ని బోధించారు. లౌకిక భోగాలను ఆస్వాదించటం తప్పుకాదని వాదించిన శ్రమణులు (చార్వాకులు, లోకాయతులు) సైతం నిరాడంబరమైన జీవితం గడిపారు. ఇంద్రియ అనుభవాల వెంట పరుగులు తీయటం దుఃఖానికి దారితీస్తుందని, వాస్తవిక జ్ఞానం, అంతరంగ పరివర్తన, సహనశీలత, సోదరభావం, ద్వారానే మానవుడు విముక్తిని, శాంతిని పొందగలడని శ్రమణ గురువులైన మహావీరుడు, బుద్ధుడు బోధించారు. ఈ సంప్రదాయంలో గురుదక్షిణ అనేది లేదు.

(5) శ్రమణ, వైదిక సంప్రదాయాలను తులనాత్మకంగా అధ్యయనం చెయ్యటంలో పరిశీలించదగిన మరో ముఖ్యమైన అంశం, నైతికత పట్ల వారు అనుసరించిన వైఖరి.

వైదిక సంప్రదాయం వర్ణవ్యవస్థ పరిధిలోనే నైతికతను నిర్వచించింది. కనుక, వారి నైతికతకు సార్వత్రిక లక్షణాలు లేవు. ఏ వర్ణం నైతికత దానిదే అని చెప్పినట్లు పైకి కనిపిస్తుంది. కాని, దాని అంతిమ లక్ష్యం మాత్రం బ్రాహ్మణవర్ణ ప్రయోజనంగా ఉంటుంది. ఈ మౌలిక ప్రయోజనానికి అనువుగా ఎప్పటికప్పుడు నైతిక సూత్రాలను మలచటం, వాటిని తిరుగులేని 'విధి'గా స్థిరీకరించటం వైదిక సంప్రదాయపు ప్రత్యేక లక్షణం. ఉదాహరణకు, మహాకవిగా ప్రసిద్ధిచెందిన బమ్మెర పోతన అనువదించిన భాగవతంలోని ఈ పద్యం చూడండి:

వారిజాక్షులందు, వైవాహికములందు / ప్రాణ విత్త మానభంగములందు
చకిత గో కులాగ్ర రక్షణములందు / బొంకవచ్చు, అఘము పొందదు అధిపా

(భావం: స్త్రీల విషయంలో, వివాహాల్లో, ప్రాణం ధనం మానం కోల్పోయే సందర్భాల్లో, భయపడిన గోవులను, బ్రాహ్మణులను రక్షించటం కోసం అబద్ధాలు చెప్పవచ్చు. ఓ రాజా, అలా చెయ్యటం వల్ల పాపం కలగదు. – భాగవతం, అష్టమ స్కంధం నుండి).

ఇక్కడ, 'కులాగ్ర రక్షణ' కోసం నైతికత విలువల్ని సవరించటం జరిగింది. ఈ విధంగా ఎవరికి అనువుగా వారు నైతికతను నిర్వచిస్తూ సవరిస్తూ వెళితే, చివరకు నైతికత అనేదానికి విలువ లేకుండాపోతుంది. జీవహింస, మాంసభక్షణ విషయంలో కూడ వైదిక సంప్రదాయపు నీతి ఒక స్థిరమైన సూత్రాన్ని పాటించదు. యజ్ఞంలో బలికోసం చంపబడిన జంతువు యొక్క మాంసం, ఆహారంలో పరమ శ్రేష్ఠమైందని (పరమం అన్నాద్యమ్ యమ్ మాంసం), దానిని తిన్న బ్రాహ్మణుడు విమోచన పొందుతాడని సతపతబ్రాహ్మణ (అధ్యాయం 7–10) చెబుతుంది. పుణ్యం కోసం జీవహింస చెయ్యాలనే ఇటువంటి వైఖరి వైదికుల్లో దీర్ఘకాలం కొనసాగింది.

జైన, బౌద్ధ శ్రమణ శాఖలు జీవహింసను నిరసిస్తూ బోధించాయి. దీనితో ప్రజల్లో తమపట్ల కలుగుతున్న వ్యతిరేకతను తప్పించుకోటానికి, కొందరు వైదికులు మాంసం తినే విషయంలో తమ వైఖరిని మార్చుకున్నారు. అయినా, మాంసం తినవచ్చనే బోధనలు మనుధర్మశాస్త్రంలో కనిపిస్తాయి.

శ్రమణ సంప్రదాయానికి చెందిన (ఆజీవక, జైన, బౌద్ధ) శాఖలు నైతిక సూత్రాల విషయంలో ఇలాంటి ద్వంద్వ వైఖరిని అవలంబించలేదు. అందుకే, సార్వజనీన సూత్రాలతో కూడిన బుద్ధుని పంచశీల ఖండాంతరాలకు వ్యాపించింది. బౌద్ధంలో నైతికత ఒక 'విధి'గా గాక, మానసిక ఏకాగ్రతను మరియు ప్రజ్ఞను పెంపొందించుకోటానికి అవసరమైన సాధనంగా చెప్పబడింది.

(6) వేదాల్లో ఆత్మవాదం ఒక మౌలిక భావనగా కనిపించదు. ఆనాటికి అది ఒక స్థిరమైన వాదంగా రూపొందలేదు. కాని, ఉపనిషత్తుల్లో కర్మ, పునర్జన్మతో కూడిన ఆత్మవాదం స్పష్టంగా ముందుకొచ్చింది. ఆనాటి నుండి ఇది అంచెలంచెలుగా బలపడింది. దీనిలో కూడ వర్ణాశ్రమ ధర్మాన్ని చొప్పించటంతో, ఇది కూడ సార్వజనీనతను కోల్పోయింది. కాని, కొందరు ఆధునిక పండితులు దీనిలో వర్ణాశ్రమ అంశను మరుగుపర్చి, దీనిని సార్వత్రిక ధర్మంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే వైదికుల ఆత్మవాదం భారతదేశంలో ఒక రకంగాను, విదేశాల్లో మరో రకంగానూ ప్రచారంలో ఉంది.

శ్రమణ సంప్రదాయంలో పరమాత్మ భావన లేదని ముందే చెప్పుకున్నాం. కాని, వ్యక్తివాదం రూపంలో ఆత్మవాద భావనకు శ్రమణులే ఆద్యులని తెలుస్తుంది. దీని ఆధారంగానే ఈ సంప్రదాయంలో కర్మ, పునర్జన్మ వాదాలు బలంగా ప్రచారంలో ఉన్నాయి. ఆత్మవాదం అరవైరెండు రూపాల్లో ఉంటుందని బౌద్ధగ్రంథమైన దీఘనికాయలోని బ్రహ్మజాల సుత్తం చెప్పింది. అనిత్య భావన ఆధారంగా, అన్నిరకాల ఆత్మవాదాలను తిరస్కరించిన బౌద్ధం అనాత్మ వాదాన్ని ఆవిష్కరించింది. ఇలా ఒకే అంశంపై భిన్నమైన తాత్విక వాదనలు కొనసాగించి, శ్రమణ సంప్రదాయం తాత్విక వైవిధ్యాన్ని సుసంపన్నం చేసింది.

**ఆధునిక శ్రమణుల కర్తవ్యం**

తొలిదశలో, శతాబ్దాల తరబడి, శ్రమణ సంప్రదాయం వ్యక్తులుగా, అసంఖ్యాకమైన చిన్న చిన్న శాఖలుగా మనుగడ సాగించింది. అయితే, క్రీ.పూ. 5వ శతాబ్దిలో అది ఆజీవక, జైన, బౌద్ధ తదితర రూపాల్లో స్థిరమైన శాఖలుగా విస్తరించింది. వారు ఏ శాఖకు చెందినా, శ్రమణులు అందరూ నైతిక విలువలను శ్రద్ధగా పాటించేవారు. అందుకే వారు ప్రజాదరణ పొంది, ప్రజలపై ఆధారపడి జీవించగలిగారు. శ్రమణులు స్థిరమైన శాఖలుగా ఏర్పడక ముందే, వారి నివాసాల కోసం సత్రాలు, చర్చల కోసం సమావేశ మందిరాలు నిర్మించబడి ఉన్నట్లు త్రిపిటకాల ద్వారా తెలుస్తుంది. నిరీశ్వరవాదాన్ని అనుసరించిన శ్రమణులను ప్రజలు ఇంతగా ఆదరించటం, అంతకంటే ముఖ్యంగా, జీవితాంతం బ్రహ్మచారులుగా బ్రతికే శ్రమణులకు, వైదికులవలె అనువంశిక వారసులు లేకపోయినా, వారి సంప్రదాయం వేల సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా కొనసాగటం మానవజాతి చరిత్రలోనే ఒక అద్భుత పరిణామం.

శ్రమణ సంప్రదాయం ఒక గత వైభవమని, అది ఈనాడు ఉనికిలో లేదని అనుకోవటం సరికాదు. జైన, బౌద్ధ శాఖల రూపంలో, ఇంకా, అచేలకవాదం వంటి అనేక చిన్న శాఖల రూపాల్లో అది ఈనాటికీ కొనసాగుతూనే ఉంది. వేమన వంటి ఎందరో శ్రమణులు ఈ నేలపై జన్మించి, వ్యక్తులుగానే జనహితానికి ఎనలేని సేవచేసి చరిత్రకెక్కారు.

అంతేకాదు, ఈనాడు మనదేశంలో ఆధునిక భావాల ప్రతీకలుగా చెప్పబడుతున్న నాస్తిక, హేతువాద, మానవవాద తదితర నిరీశ్వరవాద ఉద్యమాలు, మరో రూపంలో, శ్రమణ సంప్రదాయ వారసులని చెప్పటం అతిశయోక్తి కాదు. ఇంతవరకూ చెప్పుకున్న విషయాలనుబట్టి, శ్రమణ సంప్రదాయం ఒక స్వతస్సిద్ధమైన (original), స్వతంత్రమైన బౌద్ధిక – తాత్త్విక ధార్మిక ప్రవంతి అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అది వైదిక సాంప్రదాయం నుండి పుట్టిందని, దానిలో అంతర్భాగమని లేదా వైదిక మతంపై తిరుగుబాటుగా వచ్చిందని చెప్పటం సరికాదు. ఆర్యుల రాకకు పూర్వమే శ్రమణులు భారతావనిలో ఉన్నారు. వైదిక సంప్రదాయం మొదలైన తరువాత, శ్రమణ సంప్రదాయం తన అస్తిత్వం కోల్పోకుండా మనగలిగింది. అంతేకాదు, అది వైదిక సంప్రదాయం కంటే బలమైన శక్తిగా కొనసాగింది. ఈ రెండు సంప్రదాయాల సుదీర్ఘ సంపర్కంలో, అవి గణనీయంగా పరస్పర ప్రభావానికి లోనయ్యాయి. లోతుగా పరిశీలిస్తే, వైదికుల నుండి శ్రమణులు స్వీకరించిన దానికంటే, శ్రమణుల నుండి వైదికులు నేర్చుకున్నది ఎంతో ఎక్కువని తెలుస్తుంది. కనుక భారత చరిత్ర మరియు తత్వచింతన గురించి, వైదికవాదులు పరికల్పించి ప్రచారం చేస్తున్న ఏకమూస సంస్కృతి సిద్ధాంతాన్ని, దీనికి మాతృకయిన 'వైదిక నమూనా'ను పూర్తిగా తిరస్కరించాలి. భారతదేశ చరిత్ర అధ్యయనాన్ని వక్రమార్గం పట్టించిన ఈ 'వైదిక నమూనా' చట్రాన్ని ఛేదించాలంటే, శ్రమణ సంప్రదాయాన్ని నిర్దిష్టంగా, లోతుగా అధ్యయనం చెయ్యాలి; దాన్ని వెలుగులోకి తీసుకురావాలి. అప్పుడు మాత్రమే భారతదేశ చరిత్రను, ప్రత్యేకించి దాని బౌద్ధిక–తాత్త్విక చింతన పరిణామాన్ని వాస్తవిక దృష్టితో అర్థంచేసుకోవటం సాధ్యమౌతుంది.

ప్రపంచ చరిత్రలో సాటిలేని శ్రమణ సంప్రదాయం భారత ప్రజానీకానికే గాక, మానవజాతి అంతటికి అమూల్యమైన ఫలాలను అందించింది. వాటిలో కొన్ని మన జీవన విధానంలో అంతర్భాగమై నేటికీ కొనసాగుతున్నాయి; కాలక్రమంలో చాలావాటిని మనం కోల్పోయాం. భారత సంస్కృతికి శ్రమణులు అందించిన అనేక విలువైన అంశాలను, వైదికులు తమ ఘనకార్యంగా చాటుకుంటున్నారు. వీటి ఆధారంగానే వారు మొత్తం భారత సంస్కృతికి వారసులుగా చెప్పుకుంటున్నారు. మరోవైపు, శ్రమణులకు నిజమైన వారసులైన ఆధునిక లౌకిక వాదులు, తమ గతాన్ని మరిచిపోయి, భారత సంస్కృతికి తమ పూర్వీకులు అందించిన మహోన్నతమైన ఫలాలను చేతులారా వైదికులకు ధారాదత్తం చేస్తున్నారు. ఈ వైఖరి వలన హేతుబద్ధ లౌకికవాద ఉద్యమాలు తమ చారిత్రిక పునాదిని కోల్పోతున్నాయి. ఈనాటి లౌకిక ఉద్యమాలు ఐక్యత కోల్పోయి బలహీన పడటానికి ఇదొక ముఖ్యమైన కారణమని చెప్పొచ్చు. కనుక, మన దేశంలోని నాస్తికులు, హేతువాదులు, మానవవాదులు, మార్క్సువాదులు, బౌద్ధులు తమ మూలాలను గుర్తించాలి. తమ పూర్వీకుల తాత్త్విక సంపదను స్వంతం చేసుకోవాలి. తాము శ్రమణ సంస్కృతికి ఉమ్మడి వారసులమని గుర్తించి, ఒకరికొకరు సహకరించుకుంటూ, తమకు గల ఉమ్మడి లక్ష్యాల దిశగా ఐకమత్యంతో పనిచెయ్యాలి.


# వాస్తు అబద్ధం! – మా.శ్రీ.రాజు

కొడుక్కి ఉద్యోగం లేకపోయేసరికి, ఇంటి ముందు గది కట్టించి, కొడుకుచేత కొట్టు పెట్టిద్దామనుకున్నాడు కొమరయ్య. వాస్తు ప్రకారం కట్టవలసిన వైపు, ఇది వరకు వెడల్పాటి పెద్ద బావి వుండేది. దాన్ని పూడ్చేశారు. అక్కడ గది కడితే, గది కుంగుతుందని కొమరయ్య భయపడ్డాడు. అదీ కాకుండా ఆ స్థలంవైపే, బయట కరెంటు స్తంభం వుంది. దాని వైర్లు అన్నీ, ఈ స్థలం మీద నుంచే, వెనక్కి వెళ్ళాయి. ఆ స్థలంలో గది కడితే, కరెంటు తీగలతో ఇబ్బంది కూడా ఏర్పడుతుందని కొమరయ్య భావించాడు. ఈ రెండు కారణాలతో వాస్తుప్రకారం, ఇంటి ముందు కట్టవలసిన వైపు కాకుండా, వాస్తు ప్రకారం కట్టకూడని వైపు, ఇంటిముందు గది కట్టించి, కొడుకు చేత కొట్టు పెట్టించాడు. కొన్ని సంవత్సరాలు వ్యాపారం బాగానే జోరుగా సాగింది. అంతలో కొడుక్కి ఉద్యోగం వచ్చి, కొట్టు వదిలేసి, కొడుకు వెళ్ళిపోయాడు. పెట్టిన కొట్టు మూసేయటం ఇష్టంలేక, కొమరయ్యే కొట్టు కొనసాగించటం ప్రారంభించాడు. అయితే కొమరయ్య వయస్సులో పెద్దవాడు కావటం వల్ల, అయిపోయిన సరుకులు వెంటనే తెచ్చి, కొట్టులో పెట్టటం కొమరయ్యకి సాధ్యమయ్యేది కాదు. ఓపిక లేకపోవటం వల్ల, కొట్టు కూడా సమయానికి తీసేవాడు కాదు. తనకు తీరిక దొరికినప్పుడు తీసేవాడు. అన్ని సరుకులు లేకపోవటం వల్ల, ఎప్పుడూ కొట్టుతీసి వుండక పోవటం వల్ల, జనం పక్క కొట్లకి అలవాటుపడి, ఈ కొట్టుకి రావటం మానేశారు. లేని సరుకులు లేకపోగా, ఉన్న సరుకులు కూడా ఎవరూ కొనకపోయేసరికి, సరుకులు గడువు తేది దాటిపోయి, సరుకులు పారేయాల్సి వచ్చి, పారేసేవాడు. లాభాలు లేకపోగా, అసలు కూడా రాక, కొట్టు దివాలా తీయటం ప్రారంభించేసరికి, కొమరయ్యకి బాగా దిగులు పట్టుకుంది. వాస్తు ప్రకారం కట్టవలసిన వైపే, కొట్టు కట్టకపోవటం వల్లే, ఇలా జరుగుతుందని కొమరయ్య క్రుంగిపోసాగాడు.

ఆ ఊరిలో బాగా పేరు గడించిన వాస్తు పండితుడు వరదయ్య, ఈ బజారు వైపు ఒకసారి ఏదో పనిమీద వచ్చి, వాస్తు ప్రకారం లేని కొమరయ్య కొట్టు చూసి, కొమరయ్య దగ్గరకు వచ్చి "వ్యాపారం ఎలా జరుగుతుంది?" అని అడిగాడు. "ఏం సాగటం లేదు" అని కొమరయ్య ఆవేదనతో చెప్పాడు. "వాస్తు ప్రకారం అటు కట్టవలసింది, ఇటు కట్టటం వల్లే ఇలా జరుగుతుంది. మీ ఇల్లు కూడా వాస్తు ప్రకారం లేదు. వాస్తులోపం వుంది. నన్ను సంప్రదించకుండా ఇలా ఎందుకు చేశారు? అందుకే మీకు దరిద్రం పట్టుకుంది" అని చివాట్లు పెట్టి వెళ్ళిపోయాడు. వాస్తు ప్రకారం కట్టకపోవటంవల్లే, ఇలా జరుగుతున్నదని అసలే ఆవేదనతో వున్న కొమరయ్యకి, వాస్తు పండితుడి చివాట్లు మరింత ఆవేదనకి గురిచేసాయి.

కొన్ని నెలలు గడిచాయి. వాస్తు పండితుడు వరదయ్య భార్యకి ఏదో వ్యాధి సోకిందని, వరదయ్య ఆస్తి అంతా ఊడ్చిపెట్టి, వైద్యం చేయించినా, ఆమె బ్రతకలేదని, చనిపోయిందని, వాస్తు పండితుడు వరదయ్య మనోవేదనతో ఉరి పెట్టుకొని చనిపోయాడని కొమరయ్యకి తెలిసింది. కొమరయ్య చాలా బాధపడి, చూసివచ్చి, ఆలోచనలో పడ్డాడు. వరదయ్యగారు పెద్ద వాస్తు పండితుడు. అతను వాస్తు ప్రకారమే ఇల్లు కట్టించుకున్నాడు. (మిగతాది ప్రక్క పేజీలో)

# రాహువే లేనప్పుడు రాహుకాలం ఎక్కడిది?




*(కర్ణాటక రాష్ట్రానికి చెందిన విద్యావేత్త డా॥ హెచ్.నరసింహయ్య మూఢనమ్మకాలు, దేవుడు పేరుతో జరుగుతున్న దోపిడీని ప్రతిఘటించి, ప్రజల్లో శాస్త్రీయస్పృహ పెంచడానికి విశేష కృషి చేసిన హేతువాది. సత్యసాయిబాబా మహిమలపై పోరాడిన వ్యక్తిగా ప్రసిద్ధుడు. ఆయన ఆత్మకథ 'హోరాటద హాది'ని 'పోరాటపథం' పేరిట కోడీహళ్ళి మురళీమోహన్ కన్నడం నుంచి తెలుగులోకి అనువదించారు. అందులోని కొన్ని భాగాలివి.)*

నా బాల్యంలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన జాతీయ నాయకులు నా ఆలోచనలను, విలువలను రూపొందించారు. నేను అన్నింటినీ గంభీరంగా తీసుకుంటాను. అందువల్లే నేను 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొనింది. శ్రీరామకృష్ణాశ్రమంలో రెండు సంవత్సరాలు ఉన్నప్పుడు స్వామీ వివేకానందగారి They alone live who live for others. The rest are more dead than alive. పరులకోసం ఎవరు బతుకుతారో వారిదే నిజమైన బతుకు. మిగిలిన వారు జీవచ్ఛవాలు", అన్న సూక్తి నా మనసులో ముద్రపడింది. ఒకటి రెండు సంవత్సరాలు సావధానంగా ఆలోచించి అన్ని సాధక బాధకాలను పరిగణనలోకి తీసుకుని పెళ్లి చేసుకోకూడదని అంతిమ నిర్ణయం తీసుకున్నాను. ఇది కూడా నేను తీసుకున్న అత్యంత ముఖ్య నిర్ణయాలలో ఒకటి.

పెళ్లి చేసుకోవాలి అనేది అత్యంత సహజమైన, బలమైన ఒత్తిడి. పెళ్లి చేసుకోకుండా ఉండాలి అంటే పెళ్లి చేసుకోవాలన్న ఒత్తిడికి సరితూగే అంతే బలమైన, మక్కువైన ప్రయోజనం, లక్ష్యం జీవితంలో ఉండాలి. ఆలోచనలు అడ్డదిడ్డంగా పోకుండా వాటికి కళ్లెం వేసే ఎల్లప్పుడూ చేతినిండా పని, క్రమశిక్షణతో కూడిన జీవితం, ఏదైనా సాధించాలనే హఠం ఉండాలి. అప్పుడు ఆలోచనలు పక్కదారి పట్టే సంభవం తక్కువ అవుతుంది. →

---

## వాస్తు అబద్ధం!

అయినా అతన్ని, అతని భార్యని వాస్తు ఆదుకోలేదు. ఇక వాస్తులో గొప్పతనం ఎక్కడుంది? నా ఇల్లు, నా కొట్టు వాస్తు ప్రకారం లేకపోయినా, ఆయనకంటే నేను చాలా పెద్దవాడినైనా, ఏ అనారోగ్యం లేకుండా, ఆరోగ్యంతో హాయిగా వున్నాను. నా భార్య కూడా ఆరోగ్యంతో హాయిగానే వుంది. నా కొడుకు పెద్ద ఉద్యోగం వచ్చి సుఖంగానే వున్నాడు. ఇగ వాస్తులో నిజం ఎక్కడుంది? వాస్తు పచ్చి అబద్ధం. కొట్టు నడవకపోవటానికి, కొట్టులో సరుకులు అన్నీ లేకపోవటం, సమయానికి నేను కొట్టు తీయకపోవటమే కారణాలు కాని, వాస్తు కారణం కానే కాదు. నా వయోభారం వల్ల, నేను కొట్టు నడపలేకపోతున్నాను. ఎవరికైనా కొట్టు అద్దెకు ఇచ్చి నేను ప్రశాంతంగా వుండాలి. 'అబద్దాల వాస్తు గురించి ఇగ నేను ఆలోచించకూడదు. ఆందోళన చెందకూడదు' అని మనసులో కొమరయ్య స్థిర నిర్ణయానికి వచ్చాడు. ♦

నేను పుట్టింది ఆదివారం నాడు. అయితే నా జీవితంలో ఆదివారమే లేదు అని వెనుక ఎక్కడో చెప్పాను. ఇది అక్షరాలా నిజం. ఇంతవరకూ నాకు ఏ ఆదివారమూ, సెలవురోజూ లేదు. నేను చేసే పని ఎక్కువ శ్రమతో కూడినదైనా నాకు ఎక్కువ సంతృప్తిని ఇస్తుంది. అయినా అప్పుడప్పుడూ ఒంటరితనం గుర్తుకు వస్తుంది. అయితే ఆ ఆలోచన కాలవ్యవధి చాలా కొంచెమే.

నేను మొదటి నుండీ స్వతంత్రంగా ఆలోచించే స్వభావాన్ని అభ్యాసం చేసుకుంటూ వచ్చాను; దేనినీ ప్రశ్నించకుండా ఒప్పుకోను. నేను మూఢనమ్మకాలను, మాయామంత్రాలను, జ్యోతిష్యాన్నీ కటువుగా విమర్శిస్తూ వచ్చాను. మాయలు, మూఢనమ్మకాల గురించి నా ఖచ్చితమైన అభిప్రాయాలను వెనుక చాలా వివరంగా చెప్పాను. జ్యోతిష్యం గురించి సంక్షిప్తంగా కొన్ని విషయాలను చెప్పడం ఉచితం అనిపిస్తుంది. మనిషిపై గ్రహాల ప్రభావం ఉంది అనే నమ్మకంపై నిర్మించిన సౌధమే జ్యోతిష్యశాస్త్రం. జ్యోతిష్యం ప్రకారం తొమ్మిది గ్రహాలున్నాయి. ఆ తొమ్మిదిలో సూర్యుడు, చంద్రుడు, రాహువు, కేతువులు ఉన్నాయి. సైన్స్ ప్రకారం సూర్యుడు గ్రహం కాదు, ఒక నక్షత్రం. చంద్రుడు ఉపగ్రహం. రాహు కేతు గ్రహాలు లేనేలేవు. ఈ విషయాలన్నీ ఒక హైస్కూలు విద్యార్థికి తెలుసు. జ్యోతిష్కుల తొమ్మిది గ్రహాలలో నాలుగు తప్పుడు లెక్కాచారంతో కూడి ఉన్నాయి. దీనితో జ్యోతిష్యం కథ ముగిసింది కదా! దానికి పునాదే గట్టిగా లేకపోయింది. అందువల్ల దానిమీద కట్టిన జ్యోతిష్యం అనే సౌధం కుప్పకూలిపోయింది.

రాహువే లేనప్పుడు రాహుకాలం ఎక్కడ నుంచి వస్తుంది? రాహుకాలం చెడ్డది అనే భావన చాలామందిలో ఉంది. అది నిజమయితే రాహుకాలంలో బయలుదేరే బస్సులకు, రైళ్లకు, విమానాలకు ప్రమాదాలు జరగాలి. ప్రమాదాలకు రాహుకాలానికీ ఏ సంబంధమూ లేదు. జాతకాలు కూడా జ్యోతిష్యం ఆధారంగానే రచింపబడతాయి. పిల్లవాడు పుట్టినప్పుడు గ్రహాల స్థానం ఆధారంపై జాతకం రాస్తారు. ఆ జాతకంలో పిల్లవాని జీవితంలోని అన్ని విజయాలు, ప్రముఖ ఘట్టాలు కలిగి ఉంటాయి అనే నమ్మకం ఉంది. ఇది శుద్ధ అబద్ధం. విమానప్రమాదంలో చనిపోయే వందలాది మంది జాతకాలలో వారంతా ఇలాగే మరణిస్తారని ఏ జ్యోతిష్కుడూ రాయడానికి సాధ్యం కాదు. 1962లో అష్టగ్రహకూటమి వల్ల అనాహుతం జరుగుతుందని బొబ్బలు పెట్టిన జ్యోతిష్కుల భవిష్యత్తు మట్టి కరిచింది. జ్యోతిష్కులు చెప్పేది అస్పష్టం. గోడమీద పెట్టిన దీపం లాంటిది. ఒక్కొక్కసారి జ్యోతిష్యం కాకతాళీయంగా నిజం కావచ్చు. చెడిపోయిన గడియారం కూడా రోజుకు రెండుసార్లు సరియైన సమయాన్ని చూపుతుంది!

చాలామందికి జ్యోతిష్యంపై నమ్మకం ఎలా ఉందో అలాగే పూజా పునస్కారాల వల్ల వ్యక్తుల, సమాజ కళ్యాణం జరుగుతుందన్న నమ్మకమూ ఎక్కువగా ఉంది. స్వతంత్రంగా ఆలోచిస్తే వీటికి అర్థం లేదు. మన యొక్క ఏ కీర్తిప్రతిష్టలకు పూజాదికాలకు సంబంధం లేదు. ప్రపంచంలో లక్షలాది మంది చింతనాపరులూ దార్శనికులూ రాజకీయ నాయకులూ పూజ, ప్రార్థనల సహాయం లేకుండానే గణనీయమైన స్థానాలను గెలుచుకున్నారు. విశ్వవిఖ్యాత ఐన్‌స్టైన్, రసెల్ వంటివారికి ఇలాంటి నమ్మకాలకూ సంబంధమే లేదు. అజ్ఞేయవాది (Agnostic) జవహర్‌లాల్ నెహ్రూ 14 సంవత్సరాలు ప్రధానిగా ఉన్నారు. అలాగే నాస్తికులు జ్యోతిబసు సుదీర్ఘ కాలంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. వీరిద్దరూ ఎక్కువ సమయం అధికారంలో ఉండి రికార్డును సృష్టించారు. ఇలాంటి నిదర్శనాలు చాలా ఉన్నాయి.

ఇంకొక సహించరాని విషయం ఏమిటంటే దేవునికి వజ్రవైఢూర్యాల తోనూ, వెండి – బంగారు నగలతోనూ అలంకరించడం. దేవునికి ఇదంతా ఎందుకు? ఒక విచిత్రమైన విషయం ఏమిటంటే ఇలాంటి శ్రీమంతులైన దేవుళ్ల అమూల్యాభరణాలను మనం – మనుషులం కాపాడాలి. తనను తాను కాపాడుకోలేని దేవుడు మనలను ఎలా కాపాడుతాడు? మనల్ని మనమే కాపాడుకోవాలి.

విశ్వశాంతి కోసం యజ్ఞ యాగాదులను మన దేశంలో ఆచరిస్తారు. ప్రపంచంలోని అనేక దేశాలలో సుఖశాంతులున్నాయి. మన దేశంలోనే ఎప్పుడూ హింస, అశాంతి. అయినా విశ్వశాంతి పేరుతో వీలైనంత దోపిడీ, విలువైన వస్తువుల దహనం చెప్పలేనంతగా జరుగుతూనే ఉంది. నదులలో, 'పవిత్ర'మైన నదులలో స్నానం చేస్తే పుణ్యం వస్తుంది అనేది మరొక మూఢనమ్మకం. సంవత్సరంలో కొన్ని రోజులు 'పవిత్ర' నదులలో స్నానం చేసి పుణ్యం మూటకట్టుకోవడానికి తొక్కిసలాట. గంగానది అత్యంత పవిత్రమైన నది అనే నమ్మకం చాలామందికి ఉంది. అయితే గంగానది వంటి కలుషితమైన నది మరొకటి లేదని శాస్త్రీయంగా నిరూపించబడింది. గంగానదిని మనమే శుద్ధి చేయవలసిన పరిస్థితి వచ్చింది. చర్మాన్ని కడిగితే ఖర్మం పోతుందా?

మనలో నిదర్శనానికన్నా ప్రదర్శనానికే ఎక్కువ విలువ. బంట్రోతు మొదలుకొని రాష్ట్రపతి వరకూ చాలామంది తమ తలనీలాలను దేవునికి సమర్పిస్తారు. తలలు బోడులు కావడానికన్నా తలపులు బోడులవుతున్నాయి. ఇలాగే చాలా మూఢనమ్మకాల ప్రస్తావనను శాస్త్రీయంగా విశ్లేషించడం అవసరం. భయం, అహేతుకమైన భావనలే మూఢనమ్మకాల ఆస్తి.

నేనిలాగే మూఢనమ్మకాలను, మాయలను, అర్థరహితమైన సంప్రదాయాలని విమర్శిస్తే చాలా మందికి అనుమానం వచ్చి నాకు దేవునిపై నమ్మకం ఉందా? అని అడుగుతారు. చాలామంది తమ స్వార్థానికి దేవుణ్ణి ఉపయోగించుకుంటారు. ఇలాంటి లావాదేవీ దేవునిపై నాకు నమ్మకం లేదు. దేవుడు ఉన్నాడని శాస్త్రీయంగా నిరూపించడం సాధ్యంకాదు. "దేవుడు, ఆత్మ మొదలైన వాటి గురించి చర్చించడం వ్యర్థం. అందువల్ల మంచిపని చేయి, మంచివాడివి కా – Do good and be good' అని బుద్ధుడు పదేపదే తన శిష్యులకు బోధించేవాడు. ఇది అత్యంత వ్యావహారికమైన Practical ఉపదేశం. దేవుడు లేకపోతే పోనీ మనుష్యుడు ఉన్నాడు కదా. అందువల్ల మన ధర్మానికి మనుష్యుడు కేంద్రబిందువు కావాలి. (ఆంధ్రజ్యోతి దినపత్రిక 28-01-2024 నుండి)




**ది.17-09-2024 భారత కమ్యూనిస్టు పార్టీ కడపజిల్లా శాఖ ఆధ్వర్యంలో కడప హోచిమిన్ భవన్‌లో జరిగిన పెరియార్ 146వ జయంతి సభ దృశ్యం**

# జమిలీ ఎన్నికలు రాజకీయ నియంతృత్వానికే ....!

– షేక్ కరిముల్లా

'ఒక దేశం, ఒకే ఎన్నికలు వల్ల దేశప్రజలకు ఏమన్నా ప్రయోజనం కలుగుతుందా? ఏమీ కలగదు. ఒక దేశం ఒకే విద్య, వైద్యం వల్లనే ప్రజలకు మేలు కలుగుతుంది. ధనవంతులకు ఎలాంటి విద్యా, వైద్యం లభిస్తున్నాయో పేదలకు కూడా అలాంటి విద్య, వైద్యం లభించాలి'... అరవింద్ కేజ్రివాల్, ఢిల్లీ మాజీ సీఎం.

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశం భారత్. గతంలో స్వేచ్ఛాయుతంగా, సమయానికి ఎన్నికలు సక్రమంగా జరిగేవి. రానురానూ భారత ఎన్నికల వ్యవస్థ ఒక తంతుగా మారి నవ్వులపాలైంది. ఎన్నికలు జరుగుతున్న తీరు పట్ల ప్రజల్లో చాలా అనుమానాలున్నాయి. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతుందని అనేక పార్టీలు ఆరోపిస్తున్నాయి. పాత బ్యాలెట్ విధానమే మేలని అంటున్నాయి. ఎలక్ట్రోరల్ బాండ్లు ద్వారా రాజకీయ పార్టీలకు అందుతున్న విరాళాలు, దానిమీద ఇటీవల రేగిన దుమారం, ఓటుకు నోటు, ఎన్నికల వేళ ఓటర్లకు పంచుతున్న డబ్బులు, అధికార పార్టీలు చేస్తున్న అధికార దుర్వినియోగం, కులం, మతం, దేవుడు, ప్రాంతం, భాష మొదలగు అంశాలతో ప్రజలను మభ్య పెట్టడం, విద్వేషాలు రెచ్చగొట్టడం మాములైపోయింది. (ఇలా అన్ని రాజకీయ పార్టీలు పూర్తిగా పతనమైపోయాయి. ప్రజలకు సరైన ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాలు అందక తప్పని పరిస్థితులలో ఈ పార్టీలనే మారుస్తూ ఎన్నుకుంటున్నారు. నిజంగా ఎన్నికల సంస్కరణలు ఈ స్థితి మార్పు కోసం జరగాలి. ఇది నేడు ఎంతో అవసరం. ఇలా జరగకపోతే మన దేశంలో కూడా భవిష్యత్తులో శ్రీలంక, బంగ్లాదేశ్ పరిణామాలు చోటు చేసుకుంటాయి.)

దేశంలో నేడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది. దేశంలో ప్రతిపక్షమే లేకుండా చేసే వ్యవస్థను సృష్టించటం కోసం బీజేపీ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నది. ఇందుకు తాజా ఉదాహరణే జమిలీ ఎన్నికలు. కిందపడ్డా నాదే పై చేయి అన్నట్లుగా ఉంది మోడీ ప్రభుత్వ తీరు. ఏక పక్ష, నిరంకుశ విధానాలు ఇక చెల్లవంటూ 2019లో గెలిచిన 303 స్థానాల నుంచి 63 స్థానాలు కోతపెట్టి 240 స్థానాలకు పరిమితం చేసినా, ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి ప్రభుత్వం ఏర్పాటు చేసినా పాలనాపరమైన నిరంకుశవిధానాలు ఈ పార్టీ అనుసరిస్తూనే ఉంది. ప్రజల మౌలిక అవసరాలైన నిత్యావసరాలు, పేదరికం, నిరుద్యోగం, మంచి విద్య, వైద్యం అందించే విషయంలో ఏమీ చేయకుండా ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు మిగిల్చింది. ప్రజల ప్రధాన సమస్యల నుంచి పక్కదారి పట్టించటానికి జిమ్మిక్కులు, ఎత్తులు వేయడం చేస్తూ ఉంది. భిన్న సంస్కృతులు, బహుళత్వం గల ఈ దేశంలో ఒకే మతం, ఒకే రకమైన పన్ను, ఒకే రకమైన తిండి తినాలని, ఒకే భాష (హిందీ) ఉండాలని మొత్తం ప్రజల సంస్కృతిపైనే దాడిచేస్తూ ఉంది. ఇప్పుడు ఆచరణ సాధ్యంకాని, అవసరంలేని ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ జమిలీ ఎన్నికల కొరకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాధకోవింద్ కమిటీ వేసింది. (ఇందులో అమిత్‌షా, ఇతర తమ సొంత పార్టీవారే సభ్యులు. ఇక చెప్పేదేముంది అంతా జమిలీ ఎన్నికలకు

అనుకూలంగా సిఫార్సులు, వెంటనే క్యాబినెట్ ఆమోదం జరిగిపోయాయి.) కమిటీ కొద్ది కాలంలోనే 'బాగా కష్టపడి' 18వేల పేజీల నివేదిక సమర్పించింది. దేశంలో 47 రాజకీయ పార్టీలలో 32 పార్టీలు జమిలీ ఎన్నికలకు అనుకూలత తెలిపాయని, 21వేల సూచనలు అందాయని, అందులో 81శాతం మంది జమిలీ ఎన్నికలను సమర్ధించారని చెప్పింది. దేశంలో ఉన్న ఓటర్ల సంఖ్యతో పోలిస్తే ఈ సూచనలు చేసిన 21వేల మంది అభిప్రాయానికి ఏ మాత్రం విలువ ఉంటుందో కమిటీ చెప్పాలి. ఏడు దేశాల్లో జమిలీ ఎన్నికల గురించి ఆధ్యయనం చేశామని చెప్పింది. తొలిదశలో లోక్‌సభ, శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు జరిపి, రెండో దశలో పంచాయితీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు 100 రోజుల వ్యవధిలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పింది. ఈ జమిలీ ఎన్నికల అమలుకు కనీసం ఆరు రాజ్యాంగ సవరణలు చేయవలసి ఉంటుందని చెప్పింది. 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయడంతో పాటు, లోకసభ, రాజ్యసభ కాలపరిమితిని నిర్ణయించే 83వ ఆర్టికల్, రాష్ట్రాల శాసనసభల కాలపరిమితి నిర్ణయించే 172వ ఆర్టికల్, ఎన్నికల సంఘం అధికారాలకు సంబంధించిన 324వ ఆర్టికల్, స్థానిక పంచాయితీరాజ్‌కు సంబంధించిన ఆర్టికల్స్ 243 కె, 243జెడ్, ఏ లను కూడా సవరించాలని సూచించింది. ఈ రాజ్యాంగ సవరణలు జరగాలంటే లోక్‌సభ, రాజ్యసభలలో 2/3 మెజార్టీతో ఆమోదించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉభయ సభల్లో బీజేపీకి ఉన్నబలం సరిపోదు. స్థానిక సంస్థల రాజ్యాంగ సవరణలకు సగం రాష్ట్రాల శాసన సభలు ఆమోదించాల్సి ఉంటుంది. ఇదంతా సాధ్యమయ్యే పనేనా?

స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో అంటే 1952, 1957, 1962లలో జమిలీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత కొనసాగింది. 1967 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది రాష్ట్రాలలో ఓటమి చెందింది. తదుపరి చాలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. 1989 నుంచి 2014 వరకు కేంద్రంలో, రాష్ట్రాలలో ప్రస్తుతం ఇప్పుడు కూడా సంకీర్ణ (కూటమి) ప్రభుత్వాలు నడుస్తున్నాయి. దేశంలోని భిన్న సంస్కృతులు, చారిత్రక పరిస్థితుల రీత్యా బహుళ పార్టీలు మనుగడలో ఉన్నాయి. ఈ తరుణంలో జమిలీ ఎన్నికలు ఆచరణలో సాధ్యం కాదు. గతంలో 1989, 1996, 1998లలో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడి కీచులాడుకొని ముందే రద్దయ్యాయి. జమిలీ ఎన్నికల వ్యవస్థలో దీనికి సమాధానం లేదు. ఎన్నికల తదనంతరం లోక్‌సభ, శాసనసభలు ముందే రద్దు అయితే పరిస్థితి ఏమిటి? రాజ్యాంగంలో 83వ ఆర్టికల్ లోక్‌సభ, 172వ ఆర్టికల్ శాసనసభలు ముందే రద్దు కావటానికి అవకాశం ఇచ్చాయికదా? ఏదైనా జమిలీ ఎన్నికల ప్రక్రియ మొత్తం రాజ్యాంగ సమాఖ్య స్పూర్తికి పూర్తి విరుద్దంగా ఉంది. రాజ్యంగంలో ఒకటవ నిబంధన భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొంది. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా బలంగా సమాఖ్య స్ఫూర్తితో మెలగాలని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సూచించారు. ఈ జమిలీ ఎన్నికల ద్వారా బీజేపీ సమాఖ్య విధానాన్ని దెబ్బకొట్టి ఏకపార్టీ (బీజేపీ) నియంతృత్వం కోసం పాకులాడుతుంది. కేంద్రంలో, అన్ని రాష్ట్రాలలో బీజేపీ మాత్రమే అధికారంలో ఉండాలని కలలు కంటూ నిరంకుశ పోకడలు పోతున్నది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని పథకం

పన్నుతుంది. (ఆది నుంచి బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ప్రజాస్వామిక, లౌకిక విలువలకు, రాజ్యాంగానికి విరుద్ధంగా నడుస్తున్నది.) 1947 ఆగస్టులో త్రివర్ణ జాతీయ జండాను గౌరవించం అని ఆర్‌ఎస్‌ఎస్ ప్రకటించింది. (నాగపూర్‌లోని తమ కేంద్ర కార్యాలయంపై 2002 వరకు జాతీయ జండాను ఎగురవేయలేదు. ఇప్పుడు ఈ 'అపరదేశభక్తులే' మొన్న ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఘర్ ఘర్ తిరంగ' అంటూ ప్రతి ఇంటిపై జాతీయ జండా ఎగురవేయాలని పిలుపు నిచ్చారు.) అలాగే 1949 నవంబర్‌లో మనుస్మృతి తప్పితే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అంగీకరించం అని ఆర్.ఆర్.ఎస్. ప్రకటించింది. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటిస్తున్నది. ఆ పని ఇలా చిన్న చిన్నగా చేస్తూ ముందుకు పోతూ ఉంది. ఏదైనా ప్రజలు చరిత్ర నిర్మాతలు. వీరి నియంతృత్వ విధానాలను అడ్డుకోవాల్సిన బాధ్యత వామపక్ష, లౌకికవాద శక్తులు, మొత్తం ప్రజలపై ఉంది. వీరి ఆగడాలపై పౌరసమాజంలో చర్చ జరగాలి. వీరి నిరంకుశతత్వాన్ని తిప్పికొట్టాలి. రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్య విలువలను రక్షించుకోవాలి. ♦

---



## ప్రజాకళామండలి రాష్ట్ర నాయకులు
## కా॥ ఉన్నం నాగేశ్వరరావుకు జోహార్లు!

వ్యవస్థ మార్పు కోసం సాంస్కృతిక ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ప్రజా సాంస్కృతిక యోధుడు, ప్రజాకళామండలి రాష్ట్ర కోశాధికారి కా॥ ఉన్నం నాగేశ్వరరావు ది.20-09-2024న అనారోగ్యంతో మృతి చెందారు. ప్రజల చైతన్యం కోసం తన ఆట, పాట, డప్పు దరువులతో పోరాటాల్లో ప్రయాణం చేశాడు. నాస్తిక సమాజం నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో ప్రజాకళామండలి తరఫున సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేవాడు. కా॥ నాగేశ్వరరావు మరణం సాంస్కృతిక ఉద్యమానికి తీవ్రమైన లోటు. కా॥ నాగేశ్వరరావుకు నాస్తికసమాజం జోహార్లు అర్పిస్తూ - వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తోంది. ♦

---




**భారత నాస్తిక సమాజం (1995) ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిలింభవన్‌లో ది.15-09-2024 ఆదివారం మధ్యాహ్నం 2 గం॥లకు జరిగిన పెరియార్ 146 వ జయంతి సభ దృశ్యం.**

## వాళ్ళు చాలా క్లారిటీగానే వున్నారు ..కానీ..మనం? – పరిపూర్ణ

- స్త్రీల పైన హత్యాచారాలు జరిగినపుడు–నిందితులను శిక్షించకుండా – ఆ ప్రజా ప్రతినిధులు ఆహార్యం గురించి కామెంట్స్ చేసినపుడు చాలా క్లారిటీగానే వున్నారు.
- ఎర్రకోట సాక్షిగా సంపద సృష్టికర్తలు ఎవరో నిర్వచించినపుడు, వాళ్ళు స్పష్టంగానే వున్నారు. 1955 CAA, ని 2014 వరకు పొడిగించినపుడూ, సరిహద్దు రాష్ట్రాలకే పరిమితమైన NRC ని దేశమంతా అమలు చేస్తామని వాళ్ళు చాలా స్పష్టంగానే వున్నారు. విదేశీ బూర్జువాతో ఎన్ని లోపాయికారి ఒప్పందాలున్నా, దేశీయ బూర్జువాను ప్రపంచపటం పైకి తేవడంలో అసలు సిసలు జాతీయ సంపద సృష్టికర్తలన్న భుజకీర్తుల పటాటోపంతో చాలా స్పష్టంగానే వున్నారు.
- ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లు – డిజిటల్ ఇండియాతో విదేశీ మొబైల్ కంపెనీలకు చేతినిండా పని, మరోవైపు వాట్సాప్ యూనివర్సిటీలో డిజిటల్ మాయాజాలంతో– గోబెల్స్ మూర్ఛ పోయే విధంగా విద్వేష బీజాలు నాటడంలో చాలా స్పష్టంగానే వున్నారు.
- అంబేద్కర్‌వాదులు ప్రశ్నించకుండా, వాళ్ళే డిమాండ్ చేసినట్లు, మనువు మాటలో చెప్పాలంటే ఈ దేశం అతిశూద్రజాతి వాళ్ళనే దేశ అత్యున్నత స్థానంలో వుంచినపుడు విస్పష్టంగానే వున్నారు. రిజర్వేషన్లు రద్దు చేస్తారేమోనన్న ఆందోళన చేయకుండా – రిజర్వేషన్లకు అవకాశం వుండే ద్వారాలను మూసివేయడంలో వాళ్ళు చాలా క్లారిటీగానే వున్నారు.
- కాళ్ళు కంప్యూటర్ యుగంలో, మస్తిష్కం మనుస్మృతి కాలం నాటికి తీసుకుని పోయే ఎజెండాలో వాళ్ళు ఎంతో దూరం వెళ్ళారు. ఏ రాజ్యాంగం గొప్పదని జబ్బలు చరుచు కుంటున్నామో.. ఏ మాత్రం తేడా లేకుండా.... అనుమానం రానీయకుండా .... అంతా రాజ్యాంగం ప్రకారమే నడుచుకుంటున్నారు...
- ఇక, క్లారిటీ వుండాల్సింది మనకే.... ఈ దేశంలో కమ్యూనిస్టులకు ఏనాడో క్లారిటీ వచ్చింది...కాకపోతే..రాజ్యాంగం పైన అస్సలు నమ్మకం లేనివారు, పూర్తిగా జాతీయ బూర్జువాకు వెంట వుంటే చాలు అనేవారు. కూడదు, పై రెంటినీ మిక్స్ చేయాలనే వారు మూడు దార్ల గుండా వెళ్ళడంలో క్లారిటీగానే వున్నారు.
- 80శాతం బహుజనులకు ఈ రాజ్యాంగం ద్వారానే కష్టాలు తీరుతాయనే శుద్ధ రాజ్యాంగ వాదులందరూ సామాన్యుని ఓటు తన వాళ్ళకే ఎందుకు వేయలేకపోతున్నాడో? మీడియా ప్రచారం చేసినవాళ్లే ఎందుకు గెలుస్తూనే వున్నారో? ఒక క్లారిటీకి రాలేకపోతున్నారు.

## సంతాపం



ప్రముఖ నాస్తికులు, నాస్తిక సమాజం సానుభూతిపరులు రామినేని కామేశ్వరబాబు (86) ది.16–08–2024న తెనాలిలోని తన స్వగృహములో మరణించారు. బ్రాహ్మణ కోడూరులో జన్మించిన ఆయన PWD విభాగంలో ఉద్యోగిగా పనిచేసి రిటైరయ్యారు. ఆయన కోరిక మేరకు ఆయన భౌతికకాయాన్ని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు, నేత్రాలను అగర్వాల్ కంటి ఆసుపత్రికి అందజేశారు.

కామేశ్వరబాబు మరణానికి నాస్తిక సమాజం సంతాపం తెలియచేస్తోంది.

## విజయవంతంగా జరిగిన "నాస్తిక అధ్యయన తరగతులు"

హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ AITUC కార్యాలయంలో నాస్తిక సమాజం తెలంగాణా శాఖ ఆధ్వర్యంలో నాస్తిక అధ్యయన తరగతులు నిర్వహించడం జరిగింది. ది.15-09-2023 ఆదివారం ఉదయం 11గం॥ నుండి సాయంత్రం 6 గం॥ల వరకు జరిగింది. ప్రధానవక్త డా॥ కోయి కోటేశ్వరరావు (తెలుగు శాఖ అధ్యక్షులు ప్రభుత్వ సిటి కాలేజ్ హైదరాబాద్.) "తెలుగు సాహిత్యంలో హేతువాదం" అనే అంశంపై మాట్లాడుతూ గత సాహిత్యమంతా భావవాద కోణంలో మాత్రమే కవులు వివరించారని, దీనికి ప్రధాన కారణం బ్రాహ్మణ సమాజం ప్రధానపాత్ర పోషించిందని అన్నారు. తెలుగు కవులు వేమన, పోతులూరి వీరబ్రహ్మం, జాషువా వంటి అనేకమంది కవులు ప్రశ్నించే తత్వంతో మొదలుపెట్టి, భౌతికవాద దృక్పథంతో ప్రజలకు అనుకూలంగా రచనలు చేస్తూ ప్రజలకు చైతన్యం కలిగించారన్నారు. మార్క్సులాంటి మహనీయుల రచనలు ద్వారా సమ సమాజ స్థాపనకై శ్రమ సిద్ధాంతం ముందు కొచ్చింది. ఆ తర్వాత అంబేద్కర్ లాంటి మహనీయులు అభ్యుదయ రచనలు చేశారు. భారతంలో కృష్ణుని ఆయుధం కన్నా, రామాయణంలోని రాముని బాణం కన్నా అంబేద్కర్ కలం గొప్పదని కె.జి. సత్యమూర్తి లాంటి దళితకవులు రచనలు చేశారన్నారు. సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మ బొరుసువంటివి అని రామకృష్ణ అన్నారు. ప్రకృతిని, మానవ సమాజాన్ని తమ వాటిలో నిరంతరమూ సంభవిస్తున్న మార్పులను వాస్తవిక దృక్పథంతో, సశాస్త్రీయంగా అధ్యయనం చేసి, అవగాహన చేసుకొనే జ్ఞానసిద్ధాంతం నాస్తికత్వం అని ఆయన అన్నారు.

స్త్రీలపై అఘాయిత్యాలు - మూలాలు - పరిష్కారాలు అనే అంశంపై బి.జ్యోతి (చైతన్య మహిళా సంఘం) మాట్లాడుతూ - ఆదిమ సమాజంలో స్త్రీ పాత్ర గొప్పదే అయినప్పటికీ బానిస సమాజం, భూస్వామ్య సమాజంలో స్త్రీ పాత్ర బానిసగా, విలాస వస్తువుగా చూడబడిందని, మనువాద సంస్కృతి స్త్రీని పూర్తిగా ఒక ఆట వస్తువుగా చూస్తున్నారన్నారు. ఇప్పుడున్న పెట్టుబడిదారీ సమాజం, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, నూతన ఆర్థిక విధానాలు వచ్చి స్త్రీలపై అఘాయిత్యాలు మరీ ఎక్కువయ్యాయన్నారు. ఈ సంస్కృతి స్త్రీని పూర్తిగా విష సంస్కృతిలోకి నెట్టివేసిందని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షవర్గంగా చింతక్రింది జనార్ధన్, ఇ.ఉమామహేష్ నిర్వహించగా ఆహ్వాన వర్గంగా కె. విజయరాములు, జి.పోలప్ప నిర్వహించారు. డా॥ ఆర్.కె రచన 'తత్వశాస్త్ర చరిత్ర - గతితార్కిక భౌతికవాదం' పుస్తక ఆవిష్కరణ అరసం నాయకులు చంద్రమోహన్, స్వరాజ్యలక్ష్మి, రవికుమార్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాసంఘాలు, సంస్థ భాద్యులు పాల్గొన్నారు.

అభినందనలతో

**నాస్తిక సమాజం - తెలంగాణ, ఆం.ప్ర.**

Editor, Printed & Published by : **B. Sudhakar** Printed at MYTRI ART PRINTERS, Mahaboobnagar.